RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 21 ఆగస్ట్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:72

## 31వ దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో పాల్గోన్న ఉపముఖ్యమంత్రి భట్టి




చెన్నై తమిళనాడులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన నిర్వహించిన 31వ దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాల్గోన్నారు.

ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వీడి సతీషన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు,



ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి, అంతర్రాష్ట్ర సమన్వయం, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అవసరమైన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు.





మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన జయంతి వేడుకల్లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , కాంగ్రెస్ పార్టీ అధినేత్రి శ్రీమతి సోనియా గాంధీ , లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ( ఆర్గనైజేషన్ ) కేసీ వేణుగోపాల్ , ఎంపీ రాజీవ్ శుక్ల , చింతా మోహన్ తదితర నేతలతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి వారు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా దేశ అభ్యున్నతికి అనేక సంస్కరణలతో పాటు దేశంలో సమాచార, సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయులు రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా మధుయాష్కీ పేర్కొన్నారు.

## విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### రూ.1.83 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన, రూ.1.43 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20:** ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపేతానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.83 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్



ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

అలాగే శివసాయి నగర్‌లో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సామాజిక కార్యకలాపాలకు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బేతుపల్లి రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20:** సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 9 గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే అంశాలపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సమన్వయ సమీక్ష నిర్వహించారు. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ , అధికారులు, రైతులు పాల్గొన్నారు.



భూ సర్వేకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించిన మంత్రి పొంగులేటి అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రైతులు, పేదల భూములకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం, రైతుల ప్రభుత్వం అని స్పష్టం చేశారు. భూ సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు మంత్రి పొంగులేటి పర్యటించడం అభినందనీయమన్నారు. రైతుల భూములకు హక్కులు, రికార్డుల పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతుల సమస్యలను స్వయంగా విని, అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి పర్యటనతో బేతుపల్లి రెవెన్యూ పరిధిలో భూ సర్వే ప్రక్రియపై రైతుల్లో ఆశాభావం వ్యక్తమైంది.

ప్రజాబలం

21 ఆగస్ట్ 2026 శుక్రవారం

# మక్కా ఒప్పందం ముంచుతుందా...

పాకిస్తాన్ గత వారం సౌదీ అరేబియా, తుర్కియేలతో కలిసి ఒక కొత్త భద్రతా ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందాన్ని 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' అని పిలుస్తున్నారు. ఒప్పందం, మిడిల్ ఈస్ట్‌లో రూపుదిద్దుకుంటున్న కొత్త భద్రతా వ్యవస్థలో పాకిస్తాన్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలో దాని వ్యూహాత్మక ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.పాకిస్తాన్, సౌదీ అరేబియాల మధ్య ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన ఏడాదిలోపే ఈ మక్కా ఒప్పందం రూపుదిద్దుకుంది. భవిష్యత్తులో మరికొన్ని దేశాలు కూడా ఈ రక్షణ కూటమిలో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇది కచ్చితంగా పాకిస్తాన్‌కు కలిసివచ్చే అంశమే. భారత్‌పై సాధించిన పెద్ద దౌత్య విజయంగా దీన్ని చూపించుకోవడానికి పాకిస్తాన్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది. అయినప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ఏ ఉమ్మడి సైనిక చర్యలోనైనా పాల్గొనే ఉద్దేశం తుర్కియే, సౌదీ అరేబియాలకు ఉందని నేను అనుకోను. ఈ ఒప్పందంలో చేరడానికి ఆ రెండు దేశాలకు సొంత కారణాలు, వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయి" అని శ్యామ్ సరన్ అంటున్నారు."తుర్కియేతో పాకిస్తాన్ సంబంధాల కంటే, చైనాతో దాని సైనిక కూటమే భారత్‌కు అత్యంత ప్రమాదకరమైనదని నా ఉద్దేశం. దీనితో పాటు మనం ఆందోళన చెందాల్సిన మరో విషయం ఏంటంటే... అమెరికా మళ్లీ పాకిస్తాన్‌తో సన్నిహిత సైనిక సంబంధాలను ప్రారంభించడం. అమెరికా, చైనా రెండింటి మద్దతు మళ్లీ పాకిస్తాన్‌కు లభించడం అనేది మక్కా ఒప్పందం కంటే భారత్‌కు అత్యంత ఆందోళన కలిగించే అంశం" అని శ్యామ్ సరన్ విశ్లేషించారు.మక్కా ఒప్పందం వల్ల మధ్య ప్రాచ్యంలో ముస్లిం మెజారిటీ దేశమైన పాకిస్తాన్ ప్రభావం పెరుగుతుందని ఆగస్టు 12న ఫారిన్ పాలసీ అనే మ్యాగజీన్‌లో ప్రచురితమైన ఒక వ్యాసంలో థింక్ ట్యాంక్ 'అట్లాంటిక్ కౌన్సిల్' సౌత్ ఏషియా సీనియర్ ఫెలో మైకేల్ కుగెల్‌మన్ రాశారు."తమ దేశాన్ని ఒక బాధ్యతారాహిత్యమైన లేదా అస్థిరమైన భాగస్వామిగా కాకుండా, ప్రపంచస్థాయి శక్తిగా చూపించుకోవాలని పాకిస్తాన్ నాయకులు కోరుకుంటున్నారు. కాబట్టి ఇది వారికి చాలా ముఖ్యం. పైగా పాకిస్తాన్ వ్యూహాత్మక ప్రయోజనాలకు మిడిల్ ఈస్ట్ అత్యంత కీలకమైనది. అక్కడ దానికి ప్రధాన మిత్రదేశాలు ఉన్నాయి. పాకిస్తాన్ దిగుమతి చేసుకునే అధిక శాతం ఇంధనం అక్కడి నుంచే వస్తుంది. అలాగే లక్షల మంది పాకిస్తానీలు అక్కడ ఉపాధి పొందుతున్నారు" అని ఆ వ్యాసంలో కుగెల్‌మన్ పేర్కొన్నారు.అయితే, భారత్ పరంగా చూస్తే, ఈ ఒప్పందం వల్ల పాకిస్తాన్‌కు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఆయన స్పష్టం చేశారు."సౌదీ అరేబియా, తుర్కియేలతో పాక్ కుదుర్చుకున్న ఈ ఒప్పందం పాకిస్తాన్‌కు తన సరిహద్దు భద్రతా విషయంలో ఉపయోగపడకపోవచ్చు. పాకిస్తాన్ భారత్‌తో గతంలోనూ, అలాగే నిరుడు జరిగిన ఘర్షణలతో సహా అనేక యుద్ధాలు చేసింది. ఇది కాకుండా, ఇప్పుడు అఫ్గానిస్తాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో కూడా తరచుగా సరిహద్దు ఘర్షణలు జరుగుతున్నాయి. కానీ అసలు నిజం ఏమిటంటే, పాకిస్తాన్ మిత్రదేశాలు దాని కోసం నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం లేదు" అని కుగెల్‌మన్ రాశారు.'ఒకవేళ పాకిస్తాన్‌పై భారత్ దాడి చేసినా.. భారత్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా ఆయుధాలు చేపడుతుందని అనుకోవడం అసంభవం. ఎందుకంటే, భారత్ కూడా సౌదీకి అత్యంత సన్నిహిత భాగస్వామి. తాలిబాన్ విషయంలోనూ దీని సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.గత అక్టోబరులో అఫ్గానిస్తాన్ - పాకిస్తాన్ సరిహద్దుల్లో ఘర్షణలు చెలరేగాయి. సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన కొద్దికాలానికే ఈ ఘర్షణలు మొదలయ్యాయి. అయినప్పటికీ, సౌదీ అరేబియా ఆ ఒప్పందాన్ని అమలు చేస్తామని లేదా ఆ ఒప్పందం ప్రకారం ఈ ఘర్షణల్లో జోక్యం చేసుకుంటామని ఎప్పుడూ అనలేదు" అని మైకేల్ కుగెల్‌మన్ వివరించారు.ఇస్లాం పరంగా అత్యంత ప్రాముఖ్యత ఉన్న నగరంలో మూడు ప్రధాన ముస్లిం దేశాలు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దాంతో ఈ కూటమి భవిష్యత్తులో ఇతర ముస్లిం దేశాలను కూడా తనతో కలుపుకుని ముందుకు వెళుందనే ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో ఈ కూటమి 'ముస్లిం నేటో' రూపాన్ని సంతరించుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈజిప్ట్, ఖతర్, అజర్‌బైజాన్, జోర్డాన్, సిరియా దేశాలు భవిష్యత్తులో ఈ కూటమి విస్తరణలో చేరే అవకాశమున్న సహజమైన భాగస్వాములని 'మిడిల్ ఈస్ట్ కౌన్సిల్ ఆన్ గ్లోబల్ అఫైర్స్' సీనియర్ నాన్-రెసిడెంట్ ఫెలో అలీ బాకిర్ అన్నారు.నేటోలో రెండో అతిపెద్ద సైనిక శక్తి ఉన్న దేశం తుర్కియే. ప్రపంచంలోనే ఏకైక ముస్లిం అణుశక్తి దేశం పాకిస్తాన్. ఇక సౌదీ అరేబియా అనేది అపారమైన చమురు, ఆర్థిక బలం, పాశ్చాత్య ఆయుధాలు ఉన్న దేశం. ఈ మూడు శక్తులు ఒకే వేదికపైకి రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఒకవేళ ఏదైనా దాడి జరిగినప్పుడు ఈ కొత్త కూటమి ఎలాంటి ఉమ్మడి చర్యలు తీసుకుంటుందనే దానిపై ఇప్పటికీ ఒక స్పష్టత లేదని 'అట్లాంటిక్ కౌన్సిల్' నాన్-రెసిడెంట్ సీనియర్ ఫెలో డానీ సిట్రినోవిచ్ అన్నారు.'ఈ సైనిక కూటమిలోని దేశాలకు ఒక ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే సాధ్యమవుతుందని, ఉమ్మడి రక్షణ కూటమి సాధ్యం కాదని అన్నారు."సాధారణంగా ఉమ్మడి రక్షణ అనేది అందరికీ ఉన్న ఒకే ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఉంటుంది. ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే పెరుగుతుంది. పాకిస్తాన్, తుర్కియే, సౌదీ అరేబియా దేశాలకు వేర్వేరు శత్రువులు ఉన్నారు. అందువల్ల ఈ ఒప్పందం తర్వాత ఆయుధాల తయారీ, వనరుల వినియోగంలో సహకారం పెరగవచ్చు. కానీ ఇది 'ముస్లిం నేటో'గా మాత్రం మారదు.సౌదీ-తుర్కియే-పాకిస్తాన్ రక్షణ ఒప్పందం కేవలం ప్రచారానికే పరిమితం. ఆచరణలో అంతగా ఉపయోగపడదు. పరస్పర రక్షణ ఒప్పందానికి 'ఉమ్మడి శత్రువు' ఉండటమే ప్రాథమిక సూత్రం. కానీ ఇక్కడ అలాంటి శత్రువే లేరు" అని హక్కానీ స్పష్టం చేశారు.తుర్కియే సైనిక పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా ఆధునిక డ్రోన్లను తయారు చేసే సామర్థ్యం దానికి ఉంది. కానీ, తన పొరుగున ఉన్న ఇజ్రాయెల్ సైనిక చర్యలపై అది ఆందోళన చెందుతోంది. ఈ మూడు దేశాల ఉమ్మడి భద్రతా ఒప్పందం ఉన్నంత మాత్రాన.. పాకిస్తాన్ వెళ్లి ఇరాన్ లేదా హూతీలపై యుద్ధం చేస్తుందని కానీ, లేదా భవిష్యత్తులో భారత్ - పాకిస్తాన్ యుద్ధం వస్తే తుర్కియే నేరుగా రంగంలోకి దిగుతుందని కానీ అనుకోకూడదు" అని ఆ కథనంలో స్టాన్లీ జోనీ రాశారు.

# భీమాశంకర్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్న గవర్నర్ దంపతులు



హైదరాబాద్, ఆగస్టు 20,2026: రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి మహారాష్ట్రలోని పుణె జిల్లా ఖేడ్ తాలూకాలో ఉన్న ప్రముఖ శ్రీ భీమాశంకర్ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పరమశివుని ఆశీస్సులు పొందారు.

దగ్డూశేఠ్ హల్వాయి గణపతి ఆలయంలో పూజలు

అంతకుముందు గవర్నర్ దంపతులు పుణెలోని బుధ్వార్ పేట్‌లో ఉన్న ప్రసిద్ధ శ్రీమంత్ దగ్డూశేఠ్ హల్వాయి గణపతి మందిరాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గవర్నర్ దంపతులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20:** మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజీవ్ గాంధీ దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించారని, ముఖ్యంగా యువతకు సాంకేతిక విద్య, సమాచార రంగాల్లో కొత్త అవకాశాలకు బాటలు వేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు.

# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు**

**ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

**నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య**




తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది.

అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం: క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ

**రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత అనుచిత వ్యాఖ్యలు**

**కొండా సురేఖకు నోటీసులు జారీ చేసిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ**

**కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చిన సురేఖ**



సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు.తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.

# అంతరాష్ట్ర సమస్యల పరిష్కారానికి చర్చలే ప్రాధాన్యం

చెన్నై, ఆగస్టు 20 తమిళనాడులోని మహాబలిపురం వేదికగా జరగనున్న 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం జరిగే ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులందరూ హాజరుకానున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను సమావేశంలో ప్రస్తావించనున్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంతో పాటు ఏపీ పునర్విభజన చట్టం అమలు, పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఈ సందర్భంగా చర్చించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు పూర్తయినా పునర్విభజన చట్టంలోని వివిధ అంశాలు ఓ కొలిక్కి తీసుకువచ్చే అంశాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. షెడ్యూల్-9-10లోని సంస్థల విభజన, ఆస్తులు-అప్పుల పంపకం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారంపై చొరవ తీసుకోవాలని కేంద్రాన్ని కోరనున్నారు. రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలను కీలకంగా ప్రస్తావించ నున్నారు.రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు.. దుగరాజుపట్నం పోర్టు, విశాఖపట్నం మెట్రో, విజయవాడ మెట్రో ప్రాజెక్టులు, రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు ఇతర ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు, నిధులు, ఇతర సహకారం కోరనున్నారు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన ఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఆవిష్కరించారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా పురోగమించగలవని ఆయన ఉద్ఘాటించారు.

# మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది: రాహుల్ గాంధీ

**ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్**
**మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య**
**కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి**



లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.


## తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిక

హైదరాబాద్, ఆగస్టు 20 తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్ (1800-599-4788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు.మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు

# త్వరలో సోనియా గాంధీ ఆత్మకథ.. రాహుల్ గాంధీ భావోద్వేగ పోస్ట్

**రాజీవ్ గాంధీ జయంతి నాడు వివరాలు పంచుకున్న రాహుల్ గాంధీ**
**అమ్మ పడిన కష్టాలు తనకు, ప్రియాంకకు మాత్రమే తెలుసన్న రాహుల్**
**ప్రేమ, వివాహం, రాజకీయ జీవితంపై పుస్తకంలో కీలక అంశాలు**
**నవంబర్ 10న అంతర్జాతీయంగా విడుదల కానున్న పుస్తకం**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథకు సంబంధించిన వివరాలను వారి తనయుడు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ సందర్భంగా తన తల్లిని ఉద్దేశించి ఆయన 'ఎక్స్' వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో వెలువడనున్న ఈ పుస్తకం ద్వారా సోనియా గాంధీ వ్యక్తిగత జీవితం విశేషాలు బాహ్య ప్రపంచానికి తెలియనున్నాయి.




"అమ్మా, నిన్ను, నాన్నను చివరిసారిగా కలిసి చూసి 35 ఏళ్లు గడిచాయి. నాన్న మనల్ని విడిచి వెళ్లిన నాటి నుంచి, జీవితంలో ఎదురైన ప్రతి సవాలును నువ్వు అంతులేని ధైర్యంతో, హుందాతనంతో ఎదుర్కోవడం నేను చూశాను. నాన్న మరణం తర్వాత నీ జీవితం ఎంతటి కష్టాల గుండా సాగిందో నాకు, ప్రియాంకకు మాత్రమే తెలుసు" అని రాహుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన తల్లి అంతర్గత ప్రయాణాన్ని ప్రపంచంతో పంచుకోవడం గర్వంగా ఉందని, నేడు నాన్న కూడా నిన్ను చూసి ఎంతో గర్విస్తారని ఆయన ఆకాంక్షించారు.

ఈ పుస్తకాన్ని ప్రముఖ ప్రచురణ సంస్థ 'ఆల్ఫ్రెడ్ ఎ. నాఫ్' (పెంగ్విన్ రాండమ్ హౌస్) ప్రచురిస్తోంది. 2026 నవంబర్ 10న ఇది అంతర్జాతీయంగా విడుదల కానుంది. యుద్ధానంతర ఇటలీలో సోనియా బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, ఆయన హత్యానంతరం ఎదుర్కొన్న విషాదాకర పరిస్థితులు, రాజకీయ రంగప్రవేశం, 2004లో ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వంటి అనేక కీలక అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు సమాచారం.

ఈ సందర్భంగా ప్రియాంకా గాంధీ వాద్రా సైతం స్పందిస్తూ, తన తల్లిదండ్రుల బంధం ఈ తరం గొప్ప ప్రేమకథల్లో ఒకటిగా అభివర్ణించారు. కాగా, అంతకుముందు రాహుల్ గాంధీ ఢిల్లీలోని వీర్ భూమిని సందర్శించి తన తండ్రి రాజీవ్ గాంధీ స్మృత్యర్థం ఘన నివాళులర్పించారు.

# ఆగస్టు 26న మిలాదనబీ

హైదరాబాద్, ఆగస్టు 20 ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సెలవులకు సంబంధించి కీలక మార్పు చోటుచేసుకుంది. మిలాద్ ఉన్ నబీ పండగ సెలవు తేదీని ప్రభుత్వం సవరించింది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 25న సెలవు ఉండగా.. తాజాగా దాన్ని ఆగస్టు 26వ తేదీకి మార్చింది.ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ మార్పు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సవరించిన ఉత్తర్వులు జారీ చేశారుగతంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్‌లో ఆగస్టు 25న మిలాద్ ఉన్ నబీ పబ్లిక్ హాలిడేగా పేర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం ఆ తేదీని సవరిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది.సవరించిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 26, బుధవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వ సెలవు అమల్లో ఉంటుంది. దీంతో గతంలో ఆగస్టు 25న ప్రకటించిన సెలవు తేదీ మారినట్లయింది.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26నే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే తేదీన ఈ పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు అమలు కానుంది.




# వేధింపులు, దందాలు...చేస్తున్నారు

హైదరాబాద్, ఆగస్టు 20 తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ంఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ (ఊఓఆం) అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (జఒఅ) భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు.రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమిషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమిషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# పాపం..వంశీమోహన్ కర్మ రిటర్న్స్

విజయవాడ, ఆగస్టు 20,ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని నాయకుడిగా, గన్నవరం నియోజకవర్గంలో చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిస్థితి ఇప్పుడు సొంత పార్టీలోనే అత్యంత దయనీయంగా మారిందనే చర్చ జోరందుకుంది. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు విమానాశ్రయానికి వెళ్లిన వంశీకి అక్కడ విచిత్రమైన, అవమానకరమైన పరిస్థితి ఎదురైంది. విఐపీ విభాగానికి లేదా ప్రత్యేక పరిధికి అనుమతి దక్కకపోవడంతో, ఆయన సాధారణ కార్యకర్తలు, అభిమానులతో పాటు బారికేడ్ల వెనుక నిలబడాల్సి వచ్చింది. జగన్ బయటకు వచ్చే క్రమంలో ఆయన దృష్టిలో పడేందుకు మిగతా వారితో పాటు తోసుకుంటూ వెళ్లి పలకరించడానికి ప్రయత్నించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.ఒకప్పుడు నియోజకవర్గంలో సొంత ముద్ర వేసుకుని, అసెంబ్లీలోనూ బలమైన నేతగా నిలిచిన వంశీలాంటి సీనియర్ నేత.. ఈ రకంగా పలకరింపు కోసం నిలబడటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలు బయటకు రావడంతో సోషల్ మీడియా నెటిజన్ల నుంచి, ఆయన అభిమానుల నుంచి విభిన్న ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గన్నవరంలో ఒక వెలుగు వెలిగిన నాయకుడికి, ఈరోజు సొంత పార్టీ అధినేతను కనీసం గౌరవగా పలకరించే వెసులుబాటు కూడా లేకపోవడం ఏంటి అంటూ పలువురు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అతి రాజకీయాలే ఆయనను ఈ స్థితికి తెచ్చాయని విమర్శిస్తున్నారు.ఈ ఘటనతో వల్లభనేని వంశీ అనుచరులు, స్థానిక వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో గుసగుసలాడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో సుదీర్ఘకాలం కీలకంగా వ్యవహరించి, పార్టీ కోసం అనేక రకాల సవాళ్లను ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యేలకు, సీనియర్ నాయకులకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఈ రకంగా విమానాశ్రయం బయట రోడ్డుపై లేదా బారికేడ్ల వెనుక నిలబెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నాయకత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, జగన్‌ను విడిగా కలిసే సమయాన్ని లేదా తగిన గౌరవాన్ని కల్పించి ఉండాల్సిందని స్థానిక నాయకత్వం బహిరంగంగానే పెదవి విరుస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వైఎస్ఆర్‌సీపీలో లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు నడిచిన వ్యవస్థ వేరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రేణులను, సీనియర్ నేతలను గౌరవించుకునే విధానం వేరు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడిన మాజీ ఎమ్మెల్యేలను ఇలా సాధారణ కేడర్ తరహాలో నెట్టివేస్తే, రాబోయే రోజుల్లో మిగతా నేతల్లో కూడా నిరాశ పెరిగి పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వంశీకి జరిగిన ఈ వీధి పరాభవం ద్వితీయ శ్రేణి నాయకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే అంశంగా మారింది. గన్నవరం రాజకీయంలో ఎంతో ప్రాబల్యం ఉన్న వల్లభనేని వంశీకి ఎదురైన ఈ అనుభవం.. వైఎస్ఆర్‌సీపీలో నేతలకు దక్కుతున్న ప్రాధాన్యతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. కేవలం ప్రచారానికి, కార్యకర్తలను సమీకరించడానికే సీనియర్లను వాడుకుని, అధినేతను కలిసే సమయంలో సాధారణ జనంలా నిలబెట్టే సంస్కృతి తగదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు.

# దసరాలో లోకల్ సందడి

విశాఖపట్టణం, ఆగస్టు20, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోందిఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎంపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది.కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి అధికారిక టెస్ట్ లాంటివి . సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన భారీ విజయం తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల వేవ్ ఉండటం సహజం. మరోవైపు, పరాజయం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ స్థానిక సమరం ఊపిరి పీల్చుకునే అత్యంత కీలకమైన వేదిక. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న వైసీపీ, స్థానిక సంస్థల ద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో మళ్లీ ఉత్సాహం నింపాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల బలంతో పాటు,వైసీపీ శ్రేణులు కనీసం వార్డు, పంచాయతీ స్థాయిలో పట్టు నిలుపుకోగలిగితే పార్టీకి కొత్త పునాది లభిస్తుంది. అందువల్లే, ప్రభుత్వం ఎంత వేగంగా ఎన్నికలకు వెళ్లినా వైసీపీ కూడా వెనకడుగు వేయకుండా పోరుకు సిద్ధమవుతోంది.ఎన్నికల వ్యూహాల పరంగా చూస్తే.. స్థానిక పోరులో పార్టీ గుర్తుపై జరిగే మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోల్స్ ఒకెత్తయితే, పార్టీ గుర్తులేని ఎన్నికలు మరొకెత్తు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఉండే పాత కక్షలు, వర్గపోరు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకమైన రాజకీయ సమీకరణాల్లో అధికార కూటమి మధ్య సీట్ల సర్దుబాటు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ పరీక్షగా మారే ప్రమాదం కూడా ఉంది. దీన్ని వైకాపా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పూర్తి రాజకీయ వేడిని నింపబోతున్నాయి. పొలిటికల్ అట్మాస్ఫియర్ అంతా గ్రామ సర్పంచ్ నుండి మున్సిపల్ ఛైర్మన్ల దాకా ఆశావాహుల హడావుడితో మారబోతోంది. ఒకవైపు ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని దిగువ స్థాయి దాకా విస్తరించాలని భావిస్తుంటే, మరోవైపు ఉనికి చాటుకోవడానికి వైసీపీ పోరాడుతోంది. కాబట్టి రాబోయే రెండు నెలలు ఏపీ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల చుట్టూ తిరిగే ఓట్ల పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం.

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

విజయవాడ, ఆగస్టు 20, ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది.కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు రాఇఅ నోటిఫికేషన్ (నెం.401/రాఇఅ-ఈ1/2026-1) జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

1986 తర్వాత డైరక్ట్ఎలక్షన్స్

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు.నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.

# వెనక్కి వచ్చేస్తున్న గుంటూరు మిర్చి

గుంటూరు, ఆగస్టు 20, మన గుంటూరు మిర్చి విదేశాల్లో ఉన్న గిరాకీని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, అదంతా అప్పుడు.. ఇప్పుడు విదేశాలకు వెళ్లిన మన మిర్చి తిరిగి వెనక్కి వచ్చేస్తోంది. దానికి అసలైన కారణం రసాయనాలు ఎక్కువగా వాడటం. పురుగుమందు అవశేషాలు ఎక్కువగా ఉండటంతో చైనా, శ్రీలంక వంటి దేశాలు మన మిర్చి ఉన్న కంటైనర్లను తిరిగి పంపించేసింది. ఇలాంటి సమయంలో రైతులు పాటించాల్సిన కొన్ని సూచనలను లాంఫాం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేఫ్ కెమికల్స్ వాడితే విదేశాల్లో డిమాండ్ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.గుంటూరు మిర్చికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఈ మిర్చి కోసం విదేశీయులు కూడా పోటీపడేవారు. అయితే, ఇటీవల కాలంలో గుంటూరు మిర్చి ఏ దేశానికి వెళ్లిన తిరిగి మనకే వస్తుంది. దానికి అసలైన కారణం రసాయనాలు వాడటం. రసాయన అవశేషాలు.. అఫ్లాటాక్సిన్.. తేమశాతం ఎక్కువగా ఉందన్న కాలరణాలతో మిర్చిని తిరస్కరిస్తున్నాయి. ఇటీవల చైనా, శ్రీలంక దేశాలు మిరప కంటైనర్లను వెనక్కి తిరిగి పంపించాయి. ఇంకొన్ని దేశాలయితే ఆంక్షలు విధిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మిర్చికి మంచి డిమాండ్ రావాలంటే లాంఫాం శాస్త్రవేత్తలు కొన్ని సూచనలు అందజేస్తున్నారు.ప్రస్తుతం మిర్చికి చీడపీడలు ఎక్కువగా పడుతుండటంతో రసాయనాలు వాడాలని రైతులు అంటున్నారు. అయితే, రసాయనాలు వాడకుండా కూడా మిర్చికి మంచి దిగుబడి తీసుకురావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచిస్తున్నారు. మిరపకు సోకే పరుగులు, తెగుళ్ల వ్యాప్తిని తొలి దశలోనే గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాల ఏర్పాటుతో పాటు పంటలో అక్కడక్కడ బంతి, ఆముదం మొక్కలను ఎర పంటలుగా వేయాలని చెబుతున్నారు. ఒకవేళ రసాయనాలు వాడాల్సి వస్తే సేఫ్ కెమికల్స్ చల్లుకోవాలని సూచించారు. కాయలు కోయడానికి 25 రోజుల ముందుగా మాత్రమే రసాయనాలు చల్లాలని, దీని వల్ల పంటలో రసాయన అవశేషాల ప్రభావం చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.పంట కోతకి వచ్చినప్పుడు పూర్తిగా కాయ పండిన తర్వాతే కోసి ఆరబెట్టాలని, అప్పుడు మాత్రమే అమ్మకానికి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసేటప్పుడు కాయలను బాగా ఎండేలా చూడాలంటూ లాంఫామ్ శాస్త్రవేత్తలు వివరించారు.మన దగ్గర పండే మిరప సుమారు 30 శాతానికి పైగా ఎగుమతి అవుతుంది. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, సింగపూర్, మలేషియాతో పాటు మిడిల్ ఈస్ట్ ప్రాంతాల్లో మన మిరపకు మంచి డిమాండ్. ఈ దేశాలన్నీ తమకు దిగుమతి అయ్యే పంటలో రసాయనాలు తక్కువగా ఉండేలా ఆహార ప్రమాణాలు సవరించాయి. దాంతో మన మిరప రైతులు కూడా వాటికి తగ్గట్టుగానే సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే మంచి గిరాకీ వచ్చే అవకాశం ఉంది

# స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

హైదరాబాద్ త్వరలో ప్రారంభం కానున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఐఎస్ సదన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు దివంగత సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ బిజెపి భాగ్యనగర్ జిల్లా మహిళ మోర్చా ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఇందిరా సేవా సదన్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎంతోమంది పేద విద్యా ర్థినీలకు విద్య, వసతి కల్పించిన సంగం లక్ష్మీబాయి జ్ఞాపకార్థం సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె నామక రణం చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఆమె సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, విద్యావేత్తగా గుర్తింపు పొందారని, సైదాబాద్ ప్రాంతానికే గర్వకారణమన్నారు. లక్ష్మీబాయి సేవ లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి త్వరలో ప్రారం భించే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్ర మంలో మహిళా మోర్చా నేతలు దశరథ లక్ష్మీ. రేణుక ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

# ఐదవ అంతస్తునుంచి పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధి పద్మనగర్ ఫేస్ 2 సాయిబాబా ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల అపార్ట్ మెంట్ లో ఐదవ ఫ్లోర్ నుండి కింద పడి కార్మికుడు అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామం సిలివేరు కుమార్ (35) తండ్రి సోమయ్య గా గుర్తింపు, మృతుడికి భార్య మమత, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గాజులరామరంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బహుళ అంతస్తుల నిర్మాణంలో భవన సామాగ్రి పైన కి తీసుకెళ్లే మిషన్ ఆపరేటర్ పని చేసుకుంటూ ఉంటాడు. కాగా రోజు వారి పనిలో భాగంగా పద్మనగర్ పేస్ 2 సాయిబాబా ఆలయం సమీపంలో బహుళ అంతస్తుల నిర్మాణంలో కింద నుండి మెటీరియల్ తీసుకెళ్లే క్రేన్ మిషన్ ఆపరేటర్ గా పని చేసుంటున్నాడు. ప్రమాదవశాత్తు మిషన్ బేరింగ్ లు ఊడిపోవడంతో మిషన్ పైన ఉన్న కుమార్ ఐదవ అంతస్తు నుండి ఒక్కసారిగా కింద పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బొత్స అనూష పొలిటికల్ ఎంట్రీ...

విజయనగర్, ఆగస్టు 20, మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుఫున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

## కీసరలో టిఫిన్ సెంటర్లో అగ్ని ప్రమాదం

మేడ్చల్ కీసర గ్రామంలో టిఫిన్ సెంటర్లో సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ఉదయాన్నే టిఫిన్ తయారీ కోసమై సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి అక్కడున్న వారు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. . ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## సీనియర్ నటి షావుకారు జానకి తీవ్ర అస్వస్తత

చెన్నై సీనియర్ నటి షావుకారు జానకి తీవ్ర అస్వస్తత కు గురయ్యారు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో వెంటిలేటర్ పై నటి షావుకారు జానకి చికిత్స జరుగుతోంది. శ్వాసకోశ సమస్యలతో ఆమె వారం రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. గత రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో ఐసియూ కి తరలించారు. 95 ఏళ్ల షావుకారు జానకికి వైద్యుల ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. 1950లో షావుకారు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన జానకీ దాదాపు 400 సినిమాల్లో నటించారు.

# నిన్న నల్గొండ... ఇవాళ వరంగల్...

## కాంగ్రెస్ లో కల్లోలరాజా

హైదరాబాద్, ఆగస్టు 20 లంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అధికార కాంగ్రెస్‌లో అంతర్గత ముసలం రోజు రోజుకూ ముదురుతోంది. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారు. మొన్నటి వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నించాడు. విఫలం కావడంతో తిరుగుబాట పట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా పరకాల జరిగిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయించాలని, ఆయనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఇవి తన మంత్రివర్గ సహచరురాలు కొండా సురేఖకు షాక్ ఇచ్చాయి. పరకాల సీటు తన కూతురుకు ఇప్పించాలని మంత్రి కంటున్న కలలు కల్లలయ్యాయి.ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖకు, ఇతర ఎమ్మెల్యేలకు మధ్య సఖ్యత కొరవడింది. కొండాపై ఇటీవలే ఉమ్మడి జిల్లా నేతలు సీఎంకు, పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. కొండా మురళి అరాచకాలనూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పరకాల సభలో రేవంత్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషిని ప్రశంసించారు. ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన పనులను గుర్తు చేస్తూ, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయననే గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఇది సాధారణ ప్రోత్సాహం కాకుండా, స్పష్టమైన రాజకీయ సంకేతం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, సీఎం స్థాయిలో ఇలా పేరు తీసుకుని మాట్లాడటం అరుదు. దీంతో పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అధికార పార్టీలో బలమైన మద్దతు ఉన్నట్లు స్పష్టమైంది.మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి గత కొన్ని నెలలుగా తమ కుమార్తె సుష్మితను పరకాల నుంచి బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కుటుంబం పరకాలను తమ రాజకీయ కంచుకోటగా భావిస్తూ, సుష్మితను తదుపరి తరం నాయకురాలిగా నిలబెట్టాలని చూస్తున్నారు. గతంలో కూడా సురేఖ పరకాల నుంచి పోటీ చేసిన నేపథ్యం ఉంది. కానీ సీఎం నేరుగా ప్రస్తుత ఎమ్మెల్యే పేరు చెప్పి మద్దతు తెలపడంతో కొండా కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, సీఎం ఉమ్మడి వరంగల్ పర్యటనలో కొండా సురేఖ?మురళి దంపతులు హాజరు కాలేదు. మేడారం నుంచి పరకాల వరకు జరిగిన కార్యక్రమాల్లో వారు కనిపించకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమతుల్యతను సూచిస్తోంది. సీఎం స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇస్తూ, కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలనే సందేశం ఇచ్చినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి బలమైన స్థానిక నాయకుడిగా ఉన్నారు. ఆయనను కొనసాగించడం ద్వారా పార్టీలో స్థిరత్వం కాపాడుకోవాలని సీఎం భావించి ఉండవచ్చు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. టిక్కెట్ పంపిణీ అధికారికంగా జరగాల్సి ఉంది. కొండా కుటుంబం ఇప్పుడు ఎలా స్పందిస్తుందో, సుష్మిత ఏమి చేస్తారో చూడాలి. పార్టీలోని ఇతర నాయకులు కూడా ఈ సంకేతాన్ని గమనిస్తూ ఉంటారు.మొత్తంగా చూస్తే పరకాల సభ ద్వారా కొండా కుటుంబం పెద్ద అండ కోల్పోయినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సురేఖ పనితీరుపై సీఎం అసంతృప్తిగా ఉన్నారు. ఆమెకే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తారా లేదా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు ఆమెతోపాటు ఆమె కుటుంబానికి షాక్ ఇచ్చారు. సీఎం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

# పిల్లల కోసం...

## ఆంధ్రను మించి తమిళనాడు

చెన్నై, ఆగస్టు 20, ప్పటి వరకు ఇద్దరే ముద్దు అని ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వాలు ఇప్పుడు ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని ప్రోత్సహిస్తున్నాయి. మూడో బిడ్డ పుడితే నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పుడు అదే బాటలో వెళ్తున్న తమిళనాడు సీఎం విజయ్ కీలక ప్రకటన చేశారు. తమిళనాడు విజయ ప్రభు త్వం, మూడో బిడ్డ పుట్టినప్పుడు ఇచ్చే ప్రసూతి సెలవును 12 వారాల నుంచి 365 రోజులకు అంటే ఒక ఏడాదికి పెంచింది. రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కల్పించింది. అసెంబ్లీలో శాఖాప రమైన డిమాండ్లపై జరిగిన చర్చ సందర్భంగా తమిళనాడు మంత్రి డి. శరత్‌కుమార్ ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు మొదటి ఇద్దరు పిల్లలకు మాత్రమే 365 రోజుల సెలవు ఇచ్చేవారని, మూడో బిడ్డకు ఈ పరిమితి 12 వారాలుగా ఉండేదని, ఇప్పుడు రెండింటినీ సమానం చేశామని ఆయన తెలిపారు.తమిళనాడు అసెంబ్లీలో ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తూ, ప్రభుత్వం సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఒక మంత్రి తెలిపారు. త్వరలో అధికారిక ప్రభుత్వ ఉత్తర్వు జారీ అవుతాయి. ా.ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఇద్దరికంటే తక్కువ మంది పిల్లలు ఉన్న సాధారణ మహిళా ఉద్యోగులు మాత్రమే 365 రోజుల ప్రసూతి సెలవుకు అర్హులు. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రసూతి సెలవు కాలాన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ప్రారంభంలో ఉన్న 90 రోజుల సెలవును 2011లో ఆరు నెలలకు, ఆ తర్వాత 2016లో తొమ్మిది నెలలకు, జూలై 2021లో పూర్తి 365 రోజులకు (ఒక సంవత్సరం) పెంచారు.సుప్రీంకోర్టు ఆదేశాలు,రాష్ట్ర ప్రభుత్వ సవరణల ప్రకారం, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న మహిళా ఉద్యోగులకు కేవలం 12 వారాల (84 రోజుల) పూర్తి వేతనంతో కూడిన ప్రసూతి సెలవు మాత్రమే లభించేది. ఇప్పుడు విజయ్ ప్రభుత్వం, మూడో బిడ్డకు కూడా వర్తించే విధంగా ఒక సంవత్సరం ప్రసూతి సెలవును ప్రకటించింది.ఆంధ్రప్రదేశ్ చాలా కాలం నుంచి అనురిస్తున్న జనాభా నియంత్రణ విధానాన్ని భిన్నంగా చంద్రబాబు గతంలోనే వరాలు ప్రకటించారు. జనాభా నియంత్రణ వల్ల భవిష్యత్‌లో దేశం అనేక సమస్యలను ఎదుర్కోబోతోందని అందుకే జనాభా అవసరమని చెప్పుకొస్తున్నారు. పిల్లలను భారంగా కాకుండా సంపదగా భావించాలని సూచించారు. అందుకే ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటూ పిలుపునిచ్చారు. దీని కోసం ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తుందని వెల్లడించారు. మూడో బిడ్డను కంటే 30వేలు నాల్గో బిడ్డను కంటే 40వేలు తల్లుల ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తల్లి ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతాయని, కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వారి పోషకాహారం, చదువు బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. సమగ్రమైన స్కీమ్‌ను రూపొందిస్తున్నట్టు వెల్లడించారు.

# నరకప్రాయం... ఈ రహదారి...

హైదరాబాద్, ఆగస్టు 20, విశ్వనగరంగా గ్లోబల్ మ్యాప్‌పై మెరుస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణం రోజురోజుకూ సగటు పౌరుడికి ఒక నరకప్రాయ అనుభవంగా మారుతోంది. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి గచ్చిబౌలి, మాదాపూర్ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వరకు ప్రయాణించాలంటే గంటల తరబడి రోడ్లపైనే నరకం చూడాల్సి వస్తోంది. ఇటీవల హెచ్-సిటీ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ పనుల నెపంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్-వే విధానాన్ని అమలులోకి తీసుకురావడం ఈ సమస్యను మరింత జటిలం చేసింది. పైలట్ డ్రైవ్‌లు పూర్తి చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాల అవగాహన లేక, అశాస్త్రీయమైన డైవర్షన్ల వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.మరోవైపు గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బీహెచ్ఈఎల్, మియాపూర్ ప్రధాన రహదారులతో పాటు కనెక్టింగ్ రోడ్లు అన్నీ భారీ గోతులతో నిండిపోయాయి. వర్షాలు పడినప్పుడల్లా మోకాటి లోతు నీరు చేరడం, ఆ గుంతల్లో వాహనాలు చిక్కుకుపోవడంతో ఐటీ ఉద్యోగుల రాకపోకలు గంటల కొద్దీ ఆలస్యమవుతున్నాయి. సీఎస్ఆర్, మున్సిపల్ రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రచారం జరుగుతున్నా, వాస్తవానికి జిహెచ్ఎంసి , సైబరాబాద్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పనుల ప్రక్రియ నెమ్మదిగా సాగడం, మరమ్మతులకు వాడే క్వాలిటీ మెటీరియల్ లోపించడం వల్ల వాన పడగానే వేసిన ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి రోడ్లు మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి.ఇంతటి తీవ్రమైన సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమర్థవంతంగా హ్యాండిల్ చేయలేకపోవడానికి ప్రధానంగా సమన్వయ లేమి కారణం. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మంజీరా డిజైన్ టీమ్‌లు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య ముందస్తు ప్రణాళికలు ఉండటం లేదు. ఒకరు రోడ్డు వేస్తే, మరొకరు కేబుల్స్ లేదా పైప్‌లైన్ల కోసం దాన్ని తవ్వేస్తున్నారు. పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వర్క్ స్పేస్ అంచనా వేసి రాత్రి వేళల్లో వేగంగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పగటిపూట కూడా ఆంక్షలు విధించి సివిల్ వర్క్స్ సాగదీస్తుండటం వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కుదేలవుతోంది.రాజకీయంగానూ ఈ అంశం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓటర్లు, ఐటీ రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ ప్రభుత్వం అందించే మౌలిక వసతుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఒకవైపు పన్నులు చెల్లిస్తూ, మరోవైపు రోడ్లపై గంటల కొద్దీ వేచి చూడాల్సి రావడం వల్ల పరిపాలనా వైఫల్యం అనే ముద్ర బలంగా పడే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ ట్రాఫిక్ కష్టాలను, వర్షాకాలంలో గుంతల రోడ్ల చిత్రాలను సోషల్ మీడియాలో హైలైట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీలతో ప్రభుత్వం చర్చించి స్టాగర్డ్ వర్కింగ్ అవర్స్. హైబ్రిడ్ డ్రైవ్‌లను ప్రోత్సహించడంతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు ప్రజల నుంచి వస్తున్నాయి. హైదరాబాద్‌కు ట్రాఫిక్ అనేది కేవలం ఒక రవాణా సమస్య కాదు, అది నగరం ఆర్థిక పురోగతికి, గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్‌కు ముడిపడి ఉన్న అంశం. అధికారులు మసకబారిన పాత ప్రణాళికలను పక్కనపెట్టి, ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను ఒకే తాటిపైకి తెచ్చి యుద్ధప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ ట్రాఫిక్ గందరగోళం ప్రభుత్వం పట్ల పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిగా రూపాంతరం చెందడం ఖాయం.

# వణుకు పుట్టిస్తున్న వైద్య ఖర్చులు

ముంబై, ఆగస్టు 20, ఊహించని వైద్య ఖర్చులు తమకు ఒత్తిడిని కలిగిస్తున్నాయని 94 శాతం మంది భావిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. భారత్‌లో ఉద్యోగ భద్రత, ప్రపంచ అస్థిరత, ఇఎంఐల కంటే కూడా పెరుగుతున్న మెడికల్ ఖర్చులే ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయని టాటా ఏఐజీకి చెందిన 'ది కార్పొరేట్ హెల్త్ ప్రొటెక్షన్ పల్స్ 2026' అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోతే దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు 6 నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నెట్టుకురాగలరు.ప్రొటెక్షన్ గ్యాప్ ? పని చేసే సంస్థ ఇచ్చే బీమాతో పాటు అదనపు ఆరోగ్య బీమా ఉండటం ముఖ్యమని 84 శాతం మంది భావిస్తున్నారు, అయినప్పటికీ దాదాపు సగం మంది ఉద్యోగులు పనిచేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ) కాకుండా వ్యక్తిగత ఆరోగ్య బీమాను కలిగి లేరు. అవగాహన లోపం, తర్వాత కొనుగోలు చేద్దాంలే అనే అలవాటు వ్యక్తిగత ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. భారత శ్రామిక శక్తిపై ఆరోగ్య సంరక్షణ మోపుతున్న పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఊహించని వైద్య ఖర్చులు తమకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఇందులో పాల్గొన్న దాదాపు 94 శాతం మంది (రెస్పాండెంట్లు) తెలిపారు. ఉద్యోగం కోల్పోవడం లేదా కెరీర్ ఆగిపోవడం కంటే పెద్ద ఆందోళనగా మారింది. ఉద్యోగం లేకుండా ఒక ఏడాది కంటే ఎక్కువ రోజులు తాము ఆర్థికంగా నెట్టుకురాగలమని కేవలం 12% మంది మాత్రమే భావిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయినప్పుడు దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని కోల్పోవడాన్ని తట్టుకునేందుకు చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులు సిద్ధంగా లేరని ఈ ఫలితాలు వెల్లడించాయి.కుటుంబానికి ఆరోగ్య బీమా, ఆసుపత్రి ఖర్చులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల కోసం పొదుపు లేకపోవడం వంటివి కార్పొరేట్ భారత్‌లో ప్రధాన 5 ఆరోగ్య సంబంధిత ఆందోళనకర అంశాలుగా నిలిచాయి. ఉద్యోగం మారే సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇఎంఐలను మించి వైద్య ఖర్చులే అతిపెద్ద ఆర్థిక ఆందోళన అని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రెస్పాండెంట్లలో ఉద్యోగం మారే సమయంలో అంతరాయం లేని ఆరోగ్య బీమా కవరేజ్ ముఖ్యం అని 88 శాతం మంది భావిస్తున్నప్పటికీ, మెడికల్ కవరేజీ కొనసాగింపును అందించే సొల్యూషన్స్ కేవలం 40% మందికే తెలుసు. అంటే ఉద్యోగ మార్పు ఈ కీలక దశలో బీమా గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. "కార్పొరేట్ ఉద్యోగులు పని చేసే సంస్థ అందించే ఆరోగ్య బీమాను ఎలా చూస్తున్నారనేది అర్థం చేసుకోవడం. సన్నద్ధతలో ఇప్పటికీ ఉన్న లోటుపాట్లను గుర్తించడం ఈ అధ్యయనం ఉద్దేశ్యం. ఉద్యోగుల శ్రేయస్సుకు గ్రూప్ మెడికల్ కవర్ ముఖ్యమే అయినప్పటికీ, వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగ మార్పు సమయంలో తమ కవరేజ్ ఏ మేరకు ఉంటుందో.. అది సరిపోతుందో లేదో చాలా మందికి క్లారిటీ లేదు. వైద్య ఖర్చులు పెరుగుతున్న కొద్దీ, అవగాహన, ఆర్థిక సన్నద్ధత మరింత ముఖ్యం. ఈ విశ్లేషణలు, ఉద్యోగులు తమ ఆరోగ్య రక్షణ అవసరాలపై సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. ఆర్థికంగా నిలకడైన శ్రామిక శక్తిని నిర్మించడానికి యజమానులు, బీమా సంస్థలు, విధానకర్తల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నట్లు" టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ రీటైల్ - హెల్త్ అండర్‌రైటింగ్ హెడ్ డాక్టర్ సంతోష్ పురి తెలిపారు.ఉద్యోగం చేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ)ని నిశితంగా పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి. కంపెనీ అందించే జీఎంసీతో పాటు అదనపు ఆరోగ్య కవరేజ్ కలిగి ఉండాలని 84% మంది నమ్ముతున్నప్పటికీ, యజమాని అందించే కవర్ కాకుండా దాదాపు సగం మంది (45 శాతం) ఎలాంటి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి లేరు. అదనపు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అవగాహన లోపం, తర్వాత పాలసీ తీసుకుందామనే వైఖరి ప్రధాన అడ్డంకిగా ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా 28-34 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇది ఎక్కువగా ఉంది.ఈ అధ్యయనం ద్వారా ఉద్యోగులు తమ గ్రూప్ మెడికల్ కవరేజ్ (జీఎంసీ) పట్ల సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఆ కవరేజ్ ఎంతవరకు సరిపోతుందనే దానిపై వారికి నమ్మకం లేదు. అత్యవసర ఆసుపత్రి చేరిక సమయంలో యజమాని అందించే జీఎంసీ ఒక్కటే సరిపోదని దాదాపు 75 శాతం మంది అంగీకరించారు. కంపెనీ అందించే ఆరోగ్య బీమా పరిధి, పరిమితులపై ఉద్యోగుల అవగాహనలో లోపాలను ఈ సర్వే వెలుగులోకి తెచ్చింది. యజమాని అందించే జీఎంసీ అన్ని ఫీచర్లు, ప్రయోజనాల గురించి తమకు పూర్తిగా తెలుసునని కేవలం 41 శాతం మంది ఉద్యోగులు చెప్పారు. ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో 28-55 సంవత్సరాల వయస్సు గల 748 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడానికి కుటుంబ రక్షణే బలమైన ప్రేరణగా నిలుస్తోంది. టాప్-అప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్నప్పుడు తాము చూసే అత్యంత ముఖ్యమైన ఫీచర్లుగా ఎక్కువ బీమా మొత్తం, కుటుంబ సభ్యులకు కవరేజ్, ఉద్యోగం మారే సమయంలో కవరేజ్ కొనసాగింపు ఉండాలని కోరుకుంటున్నట్లు రెస్పాండెంట్లు పేర్కొన్నారు.

# తెలంగాణలో సగం ఓట్లు పెండింగ్..

## నాలుగో వంతు మాయం.

హైదరాబాద్, ఆగస్టు 20, తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ాఎఖీ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ాఎఖీ ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను లో పెట్టారు. అంటే ఇప్పటికి వీటిని శాశ్వతంగా తొలగించినట్లే. ఈ జాబితాలో జూన్ నాటికి ఉన్న మొత్తం 3కోట్ల 38లక్షల 26వేల ఓటర్లలో 73లక్షల మందిని పర్మనెంట్‌గా తీసేశారంటే.. పోయిన ఓట్లు ఏకంగా 22శాతం. ఇక మిగిలింది.. 2కోట్ల 65లక్షలు మాత్రమే. మరో 93లక్షల ఓట్లను ఇంకా పెండింగ్‌లోనే ఉంచారు. ఇవన్నీ కూడా 2002 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ కానివి.. లేదా ఇతర అనామలీస్ అంటే వాళ్లు చెప్పిన వాటికి అక్కడున్న వివరాలకు తేడాలు ఉన్నవి. అంటే డిజిటైజేషన్ అయిపోయిన ఓట్లలో ఇది 35శాతం. జూన్ 2026 నాటికి తెలంగాణలో మొత్తం ఓట్ల సంఖ్య 3,38, 26,244. ఓటర్ల జాబితాలో చాలా అవకతవకలున్నాయి. డూప్లికేట్ ఓటర్లున్నారు. కొంతమంది ఓట్లు మూడు నాలుగు చోట్ల కూడా ఉందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. అంతే కాకుండా బయట నుంచి వచ్చిన అక్రమ వలసదారుల ఓట్లను కూడా తొలగించాలన్న ఉద్దేశ్యంతోనే ాఎఖీ నిర్వహించారు. అందుకే ఇందులో చాలా పకడ్బందీ నిబంధనలున్నాయి. 1987 కంటే ముందు పుట్టిన వాళ్లు వాళ్ల జన్మ ధృవీకరణ పత్రం..1987-2004 వరకూ పుట్టినవాళ్లకు వాళ్ల తల్లిదండ్రుల జన్మధృవీకరణ, ఆ తర్వాత జన్మించిన జెన్‌జీలకు వాళ్ల పేరెంట్స్‌తో పాటు..ఓటర్ల జన్మధృవీకరణ తప్పనిసరి చేశారు. అలాగే ఓటు నమోదు చేసుకుంటున్న చోట అక్కడ నివాసానికి సంబంధించిన డాక్యుమెంట్లను పక్కాగా అడిగారు. అవన్నీ అడిగిన తర్వాత చాలా ఓట్లు పోతాయి అనుకున్నారు కానీ.. ఏకంగా 73లక్షల ఓట్లు మాయం అయ్యాయి. ఇది 22శాతం. ఇక్కడితోనే ఆగలేదు.. తెలంగాణలో డిజిటైజేషన్ పూర్తియన ఓట్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఇవన్నీ కూడా పర్‌ఫెక్ట్ అని చెప్పడం లేదు ఈసీ. ఎందుకంటే ఇందులో కూడా 92,87,577 ఓట్లను విత్‌హెల్డ్‌లో ఉంచింది. అంటే వీళ్ల వాలిడేషన్ పూర్తికాలేదు. దాదాపు 93లక్షల ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో వేరియేషన్స్, అలాగే వీళ్లు సమర్పించిన పత్రాల్లో ాఎఖీ 2002కు సరిపోకపోవడం వంటి కారణాలున్నాయి. డిజిటైజేషన్ పూర్తి అయిన దాంట్లో 35శాతం. ఇందులో ఎంత వరకూ పరిష్కరించి ఓకే చేస్తారో తెలీదు కానీ.. పూర్తిగా తొలగించిన ఓట్లు, సమస్యలు ఉన్న ఓట్లు మొత్తం కలిపి 1,66,26,812. అంటే జూన్ వరకూ ఉన్న మొత్తం సగం. ( 49శాతం)జాబితాలో శాశ్వతంగా లేకుండా పోయిన మొత్తం ఓట్లలో 43లక్షలు కోర్ అర్బన్ రీజియన్ అజఖీఇ పరిధిలో ఉన్నాయి. అంటే హైదరాబాద్ సహా మూడు జిల్లాలతో కూడా ప్రాతం. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ కలిపి 43లక్షల ఓట్లు ఇక్కడే పోయాయి. అంతే కాదు.. అభ్యంతరాలు, మ్యాపింగ్ సరిగ్గా అవ్వని ఓట్లు కూడా ఈ మూడు జిల్లాల్లో 39లక్షలు ఉన్నాయి. అంటే తెలంగాణలో పూర్తిగా పోయిన.. పూర్తిగా ఆమోదయోగ్యం కానీ.. కోటీ 60లక్షల ఓట్లలో 83లక్షలు కేవలం మూడు జిల్లాల పరిధిలో ఉన్నాయి.

కారణాలు ఇవేనా..?

ఈ స్థాయిలో కోర్ అర్బన్ ప్రాంతంలో ఓట్ల జాబితాలో సమస్యలు ఉండటానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్ మెట్రో సిటీ అవ్వడం వల్ల తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు... పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిలో చాలా మంది ాఎఖీ ప్రక్రియ వల్ల తమ ఓట్లను తమ ప్రాంతంలోనే రిజిస్టర్ చేసుకోవాలనుకుంటున్నారు.

ఆంధ్ర ప్రాంతంలో ఉన్నవారికి ఎక్కువ మందికి తెలంగాణ, ఆంధ్ర రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఎక్కడైనా ఒక్క ఓటే ఉండే అవకాశం ఉండటంతో వీళ్లలో ఎక్కువ మంది తమ మూలాలు ఉన్న ప్రాంతంలో ఓట్లను ఎంపిక చేసున్నారు.

తెలంగాణలో ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వచ్చిన వాళ్లు కూడా తమ సొంత జిల్లాలో ఓట్లను కాపాడుకునేదుకు హైదరాబాద్‌లో ఓటును వదిలేశారు.

ఇక హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో చాలా మందికి సరైన పత్రాలు లేవు. అందుకే ఓటరు జాబితా రివిజన్‌లో ఎక్కువ మంది తిరిగి పత్రాలు ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా 73లక్షల ఓట్లు తొలగిస్తే.. అందులో 19లక్షలు ఒక్క హైదరబాద్ జిల్లాలో ( గ్రేటర్ హైదరాబాద్ కాదు..) ఉన్నాయి. పాతబస్తీ కవర్ అయ్యే హైదరాబాద్‌లో 47లక్షలకు పైగా ఓటర్లున్నారు. అందులో దాదాపు 40శాతం అంటే 19లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదు. అలాగే ఇప్పుడు జాబితాలో ఉన్న ఓటర్లలో కూడా సమస్యలున్నాయి. వీళ్లంతా కూడా సర్‌లో పత్రాలు సమర్పించలేకపోయారు. పాతబస్తీ ప్రాంతం మొత్తం కవర్ అయ్యే హైదరాబాద్ జిల్లాలో 6,70వేల మందికి అనామలీస్ ఉంటే.. మరో 6లక్షలమందికి మ్యాపింగ్ లేదు.

# కాసులు కురిపిస్తున్న బోడె కాకరకాయలు

అదిలాబాద్, ఆగస్టు 20, ఆదిలాబాద్ జిల్లాలో బోడకాకర ఈ సీజన్‌లో మార్కెట్లో ఎక్కడ చూసినా కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ రూరల్ , మండలాల్లోని పలు అటవీ ప్రాంతాల్లో ఉట్నూర్ ఏజెన్స్ ప్రాంతంలో, అటూ కవ్వాల్ అభయారణ్యం అటవీ ప్రాంతాల్లో బోడ కాకర కాయలు విరివిగా దొరుకుతాయి. పక్కనున్న మహారాష్ట్ర సరిహద్దులోని మాండ్వి, కిన్వట్, బోరీ, పాంఢ్రకవడ, ఘాటంజి తదితర ప్రాంతాల్లోను ఎక్కువగా దొరుకుతాయి. ఇక్కడి ప్రాంతవాసులు సైతం ఆదిలాబాద్‌కు తీసుకొచ్చి మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. ఇవి కేవలం అటవీ ప్రాంతంలోనే కాదు దట్టమైన పొదల్లో, చెట్లకు అల్లుకొని ఉన్న తీగల్లోను ఈ బోడ కాకరకాయ పెరుగుతుంది. జూలై నుంచి ఆగస్టు, సెప్టెంబర్ నెల వరకు మాత్రమే ఇవి కాస్తాయి. బోడకాకర కాయలు సహజంగా లభిస్తాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో బోడ కాకరలు ఎక్కువగా దొరుకుతున్నాయి. ఆదిలాబాద్ రైతు బజార్‌తోపాటు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌లపై అమ్మకాలు చేస్తున్నారు. అమ్మకాలు చేసే వారు ఎక్కువగా అడవుల్లో బుర్క పిట్టలు, ఇతర అడవి ప్రాంతాల వనరులపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ సీజన్‌లో మాత్రం బోడకాకరలను ఎక్కువగా వీరే తీసుకొస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో బోడకాకర కిలో రూ.200 ధర పలుకుతోంది. ఒక్క రోజు ఒక్కొక్కరు చొప్పున సుమారు వెయ్యి, నుంచి 2వేల వరకు అమ్మకాలు చేసి ఉపాధి పొందుతున్నారు. బోడకాకరను తెంపడం కొంచెం కష్టంగా ఉంటుంది. ఉదయం వేకువ జామున అడవుల్లోకి వెళ్ళి చెట్ల పొదల్లో విష కీటకాల నుంచి తమను తాము రక్షించుకుంటూ ఈ బోడ కాకరలను సేకరిస్తున్నామని రాథోడ్ వివరించారు. జిల్లాలో ఎక్కువగా అడవుల్లో తమ సామాజిక వర్గానికి చెందిన వారు బోడకాకర సేకరిస్తూ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో రూ.200కేజీ అమ్ముతున్నామన్నారు. వచ్చిన డబ్బులతో తమ కుటుంబం కోసం వివిధ అవసరాల కోసం ఉపయోగిస్తున్నామని, ఈ సీజన్‌లో మాత్రమే సెప్టెంబర్ వరకు దొరుకుతాయని అన్నారు.ప్రస్తుతం శ్రావణమాసం సందర్భంగా ఎక్కువగా అందరు మాంసాహారాన్ని మానేసి బోడ కాకరను తింటున్నారు. వానాకాలంలో చికెన్, మటన్ కంటే ఔషధ గుణాలున్న బోడ కాకరకాయ తింటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం తక్కువ అని డాక్టర్లు సైతం చెబుతుంటారు. చాలామంది శ్రావణమాసంలో మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ బోడ కాకరకాయను కొన్ని ప్రాంతాల్లో ఆగాకర, బొంత కాకర, అడవి కాకర, వంటి పేర్లతో కూడా పిలుస్తారు. మరాఠీ, హిందీ భాషల్లో ఇక్కడి ప్రాంత వాసులు కర్టులే, కంటోలా అని పిలుస్తారు. సాధారణ కాకరకాయతో పోలిస్తే చిన్నగా, పైభాగంలో ముళ్లలాంటి పొరతో కనిపించే ఈ కూరగాయకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. రుచి మాత్రమే కాకుండా ఇందులో పలు రకాల పోషకాలు ఉండటం దీని ప్రత్యేకత. బోడ కాకరకాయలో పీచు, విటమిన్ ఏ, విటమిన్ సీ, విటమిన్ కె, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు లభిస్తాయి. అంతేకాకుండా యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగిన ఫైటోన్యూట్రియెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరీరంలో కణాలను దెబ్బతీసే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఈ బోడకాకరలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆహారం సులభంగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గడానికి పీచు సహాయపడుతుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువును నియంత్రించుకోవాలనుకునేవారు కూడా దీన్ని సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. ఎక్కువ నూనెతో కాకుండా తక్కువ నూనెతో వండితే మరింత ఆరోగ్యకరమైన ఎంపికగా ఉంటుంది. వర్షాకాలంలో లభించే ఈ కూరగాయలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఉండటం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన పోషకాలను అందించడంలో కూడా తోడ్పడుతుంది. చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు ఇందులో ఉండటం మరో ప్రయోజనం.బోడ కాకరకాయతో పులుసు, కూర, వేపుడు, పొడి, బిర్యానీ వంటి వంటకాలు చేసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల కోసం ఎక్కువ నూనె, ఉప్పు కలపకుండా వండటం మంచిది. మధుమేహం లేదా బీపీకి మందులు వాడుతున్న వారు ఆహారంలో మార్పులు చేసే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. సరైన ఆహారం, వ్యాయామం, నిద్రతో పాటు ఇలాంటి సీజనల్ కూరగాయలను మితంగా తీసుకోవడం ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడుతుంది.

# పొంగులేటి వ్యాపారాలపై అనేక వివాదాలు

ఖమ్మం, ఆగస్టు 20,తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన పదవిలో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చుట్టూ ముసురుకుంటున్న వరుస వివాదాలు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంత్రాంగానికి పెద్ద పరిపాలనా, రాజకీయ సవాలుగా పరిణమించాయి. ప్రభుత్వంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తారనే పేరున్న పొంగులేటి, శాఖాపరమైన నిర్ణయాల్లో దొర్లిన తప్పిదాలు , వ్యక్తిగత, కుటుంబ వ్యాపార ఆరోపణల కారణంగా నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. పరిపాలనాపరంగా ఇప్పటికే సవాళ్లు ఎదుర్కొంటున్న వేళ, స్వయంగా కీలక మంత్రి వివాదాల్లో చిక్కుకోవడం ప్రభుత్వాన్ని ప్రతిపక్షాల దాడికి సులభమైన లక్ష్యంగా మారుస్తోంది.సమస్యల్లో అత్యంత తీవ్రమైనది రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22-ఎ వివాదం. హైదరాబాద్ పరిసర జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డిల్లో పదిలక్షలకు పైగా ప్రైవేటు ఆస్తులు, అపార్ట్‌మెంట్లు అధికారులు రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి చేర్చడంతో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సాధారణంగా రెవెన్యూ శాఖలోని సమస్యలను పరిష్కరించి పౌరులకు ఉపశమనం అందించాల్సి ఉండగా, ఈ కొత్త 22-ఎ ల్యాండ్ లాకింగ్ సమస్య దశాబ్దాల తరబడి ఉన్న ఇళ్లను కూడా వివాదంలోకి నెట్టింది. తీవ్ర నిరసనల అనంతరం మంత్రి పొంగులేటి బహిరంగ క్షమాపణలు చెప్పి, అధికారులపై తప్పు తోసేసి, టోల్‌ఫ్రీ నంబర్లు పెట్టినా.. నాటకీయమైన ఈ పరిణామాలు రేవంత్ ప్రభుత్వంపై పట్టణ మధ్యతరగతికి ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశాయి.పరిపాలనాపరమైన వైఫల్యాలకు తోడు ఆయన కుటుంబానికి చెందిన వ్యాపారాలు, లీగల్ సమస్యలు కాంగ్రెస్ సర్కార్‌కు మరింత ఇబ్బందికరంగా మారాయి. ఆయన కుమారుడు హర్షా రెడ్డికి సంబంధించిన కోట్లాది రూపాయల లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా మరియు క్రిప్టోకరెన్సీ చెల్లింపుల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, డీఆర్‌ఐ ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో వరుస సోదాలు నిర్వహించడం రాజకీయ కలకలం రేపింది. ఈ కేసుల దర్యాప్తు రేవంత్ ప్రభుత్వంపై అవినీతి ముద్ర పడేందుకు దోహదపడుతుందనే అభిప్రాయం కేడర్‌లో నెలకొంది. మరో ప్రధాన ఆరోపణ పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రాజెక్టులు, అలాగే మౌలిక వసతుల కాంట్రాక్టుల కేటాయింపు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులు, పెద్ద కాంట్రాక్టుల ప్రక్రియలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధిక ప్రాధాన్యత దక్కుతోందని, ప్రైవేటు ఆస్తి అభివృద్ధి వ్యాపార సంస్థలతో పొంగులేటికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రతిపక్షాలు బీఆర్‌ఎస్, బీజేపీ ఘాటు విమర్శలు చేస్తున్నాయి. కీలక మంత్రి వద్ద అధికారం ఉండటం వల్ల సొంత వ్యాపారాలకు లబ్ధి చేకూరుతోందనే ఆరోపణ ప్రతిపక్షాలకు విమర్శల అస్త్రంగా మారింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఇది మింగుడుపడని పరిణామంగా మారినట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకవైపు ప్రజాపాలన పేరుతో మెరుగైన ఇమేజ్ సాధించడానికి సీఎం ప్రయత్నిస్తుంటే, మరోవైపు రెవెన్యూలోని 22-ఎ గందరగోళం, ఈడీ, డీఆర్‌ఐ దాడులు, కేబినెట్ సహచరుల అసంతృప్తి వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతింటోందనే ఆగ్రహం సీఎం స్థాయిలో ఉందనే ప్రచారం నడుస్తోంది. పొంగు లేటి శ్రీనివాసరెడ్డి తన శాఖలోని 22-ఎసమస్యనుఎంతవేగంగా, పారదర్శకంగా పరిష్కరిస్తారనేది ఆయన రాజకీయ భవితవ్యానికే కాదు, మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వ రేటింగ్‌కు అత్యంత ముఖ్యం.

# బావిలోకి దూసుకెళ్లిన కారు



సిద్దిపేట దుబ్బాక మండలం అప్పనపల్లిలో బుధవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది ఈ దారుణ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలతో పాటు వారి ఇద్దరు చిన్న పిల్లలు దుర్మరణం పాలయ్యారు మృతులను బలవంతపూర్ గ్రామానికి చెందిన భాగ్య, రాజు దంపతులు మరియు వారి పిల్లలు నియాన్ష్, శాన్వికగా పోలీసులు గుర్తించారు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో బలవంతపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి

# రేవంత్ సర్కార్‌కు గుదిబండగా పొంగులేటి!?



హైదరాబాద్, ఆగస్టు 20, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కనిపించిన సమాచార, పౌర సంబంధా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చుట్టూ ఇప్పుడు వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది సామాన్యుల ఆస్తులను తాకుతూ పెను దుమారాన్ని రేపుతున్న 22-ఎ సంక్షోభం రెవెన్యూ శాఖకు నేతృత్వం వహిస్తున్న పొంగులేటిని నేరుగా ఇరుకున పెట్టింది.మరోవైపు ఆయన కుటుంబ వ్యాపారాలు, వ్యక్తిగత వ్యవహారాలు నిరంతరం అధికార పక్షానికి తలనొప్పిగా మారుతున్నాయి. గతంలో ఆయన కుమారుడికి సంబంధించిన లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా ఆరోపణల కేసుల్లో ఈడీ, డీఆర్‌ఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయన నివాసాలు, కార్యాలయాలపై వరుస దాడులు నిర్వహించడం ప్రభుత్వ ఇమేజ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు, గతంలో కేవలం ప్రభుత్వ కాంట్రాక్టులకే పరిమితమైన కుటుంబ సంస్థ 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' ఇటీవలి కాలంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోని వట్టినాగులపల్లి వంటి కీలక ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోకి ప్రవేశించడం, ఆ క్రమంలో భూ వివాదాలు, పోలీస్ కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.ప్రభుత్వంలో కీలక కాంట్రాక్టులు, ప్రాజెక్టులు ఒకే సంస్థకు దక్కుతున్నాయనే అసంతృప్తి కాంగ్రెస్ అంతర్గత విభాగాల్లోనూ క్రమంగా బయటపడుతోంది. గతంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వంటి సొంత పార్టీ శాసనసభ్యులే బహిరంగంగా ఆరోపణలు చేశారు. కొండా సురేఖ కూడా అదే తరహాలో ఆరోపణలు చేశారు. ఇక రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న అవినీతిని, వివాదాస్పద భూములను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టి సెటిల్మెంట్లు చేసుకుంటున్నారంటూ వస్తున్న ఆరోపణలతో అధికార పార్టీ మరింత ఆత్మరక్షణ ధోరణిలోకి పడిపోయింది. కేడర్ కోసం ఏళ్ల తరబడి పోరాడిన స్థానిక నేతలను విస్మరించి, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారన్న భావన క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో బలపడుతోంది.ఇన్ని ప్రతికూలతలు, వివాదాలు చుట్టుముట్టినా ఆయన పట్టు తగ్గకపోవడానికి ప్రధాన కారణం ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌తో ఉన్న బలమైన ఆర్థిక, రాజకీయ బంధాలేనని భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో పార్టీకి ఆర్థికంగా అండగా నిలవడం, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడల్లా వనరుల సమకూర్పులో కీలకంగా వ్యవహరించడం వల్లే ఆయన పలుకుబడి కొనసాగుతోందనే గుసగుసలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి పొంగులేటి చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు ఒక పెద్ద 'మైనస్'గా మారాయన్నది క్యాడర్ అభిప్రాయం. సామాన్యుల ఆస్తి హక్కులను దెబ్బతీసే 22-ఎ వివాదం నుంచి మొదలుకొని, కుటుంబ వ్యాపార వివాదాల వరకు అన్నీ సర్కారు గ్రాఫ్‌ను దెబ్బతీస్తున్నాయిని అందరూ గట్టిగా నమ్ముతున్నారు

# సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ డైరక్ట్ వే...

నల్గొండ, ఆగస్టు 20, నాగార్జున సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ అనుసంధానించే 11.8 కి.మీ రహదారి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న 6 కి.మీ రహదారిని రెండు లైన్లుగా విస్తరించగా.. మరో 5.8 కి.మీ మేర టీజీఐఐసీ సేకరించిన భూముల్లో కొత్త రోడ్డును నిర్మిస్తున్నారు. మె?త్తం 7 మీటర్ల వెడల్పుతో భారీ వాహనాలకు అనుకు?లంగా ఈ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. ప్రాజెక్టుకు రూ.30 కోట్లు కేటాయించారు. రానున్న వారం రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యే ఛాన్సుంది.

తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతో పాటు ఫోర్త్ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే అక్కడ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు పలు కార్యాలయాల పనులు మె?దలయ్యాయి. ఇక ఫ్యూచర్ సిటీని చేరుకునేందుకు ప్రత్యేకంగా రోడ్లు కూడా వేయిస్తున్నారు.

ఫ్యూచర్ సిటీకి రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా తాజాగా మరో కీలక అడుగు పడింది. నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని కనెక్ట్ చేసే రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. యాచారం మండలం తక్కళ్లపల్లి గేట్ నుంచి మేడిపల్లి సమీపం వరకు కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి మరో రోడ్డు అందుబాటులోకి రానుంది. అక్కడ చేపట్టనున్న నిర్మాణాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన సామగ్రి రవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త రహదారిని అధికారులు నిర్మిస్తున్నారు. మొత్తం 11.8 కిలోమీటర్ల పొడవున ఈ మార్గాన్ని అత్యాధునికంగా డెవలప్ చేస్తున్నారు.

యాచారం మండలం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న సుమారు 6 కిలోమీటర్ల పొడవైన ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరించారు. మరో 5.8 కిలోమీటర్ల మేర మేడిపల్లి నుంచి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సేకరించిన భూముల్లో కొత్తగా మరో రహదారిని నిర్మిస్తున్నారు.ఈ కొత్త రహదారి కోసం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో రైతుల నుంచి సుమారు ఏడు ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. మొత్తం రోడ్డును ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. రానున్న కాలంలో ఫ్యూచర్ సిటీ పరిధిలో భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యంలో భారీ వెహికల్స్ సైతం సులభంగా రాకపోకలు సాగించేలా ఈ కొత్త రహదారి నిర్మాణానికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రోడ్లు, కనెక్టివిటీ కీలక మౌలిక వసతులుగా మారనున్నాయి. కొత్త పరిశ్రమలు, సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు, ఇతర నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఉక్కు, యంత్ర సామగ్రి తదితరాలను తరలించేందుకు ప్రత్యేకంగా అనుకూలమైన రోడ్లను అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ వైపు నిర్మిస్తున్న ఈ రోడ్డు కీలక రవాణా మార్గంగా ఉపయోగపడనుంది.ఈ రహదారి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లు కేటాయించింది. తారు నిర్మాణ పనులను రెండు రోజుల క్రితమే ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే రానున్న వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని టీజీఐఐసీ జెడ్‌ఎం స్మరత్‌చంద్ర తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలన్న రేవంత్ సర్కార్ ప్రణాళికలో భాగంగా కనెక్టివిటీకి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో అనుసంధానం పెరిగే కొద్దీ భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రవాణా, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు మరింత వేగం పుంజుకునే ఛాన్సుంది. ప్రస్తుత రహదారి పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులకు మాత్రమే కాకుండా పరిసర గ్రామాలకు కూడా మెరుగైన కనెక్టివిటీ లభించనుంది.

# పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా.. జీఓను రద్దు చేయాలని డిమాండ్




భద్రాద్రి న్యూస్ తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ (ఎఎ), స్కిల్ యూనివర్సిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన 'శక్తి స్కీమ్' మరియు సంబంధిత జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మధిర పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఇతర సంస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 'శక్తి స్కీమ్'ను, సంబంధిత జీఓను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాల్గొన్నారు

# సాతానిగూడెంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

## పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్?



కామేపల్లి, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం భద్రంగా ఉంటుందని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య ధ్యేయమని సాతానిగూడెం గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్ తెలిపారు. మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. ఈ పారిశుధ్య పనులను గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్, పంచాయతీ కార్యదర్శి లావణ్య దగ్గరుండి పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు,డ్రైనేజీల్లో నీరు సజావుగా సాగేలా మల్టీపర్పస్ వర్కర్లతో ప్రత్యేకంగా పూడిక తీత పనులను చేపట్టారు.ఈ పనులను పరిశీలించిన అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ. డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యగా ఈ పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టినట్లు తెలిపారు.కాలనీలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.?గ్రామంలో ఎదురవుతున్న ప్రాథమిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి,వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను వీధుల్లో వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వినుకొండలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన బొలెరో వాహనం ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం



పల్నాడు జిల్లా వెల్లటూరు రోడ్డులోని హనుమాన్ నగర్ దగ్గర గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు వల్లూరి రవి (58), వల్లూరి సావిత్రి (55)గా గుర్తించారు. మిద్దె బావి కాలనీలోని కూతురి ఇంటి నుంచి బైక్పై వస్తుండగా ప్రమాదం జరిగింది. బొలెరో ఢీకొనడంతో బైక్పై ఉన్న దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సావిత్రి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి నోటి దురద తగ్గించుకో...

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రెస్ మీట్ లో మాట్లాడారు.

తలసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనే సోయి మరిచి బూతులు మాట్లాడటం మానుకో. టిమ్స్ హాస్పిటల్ పనులు కేసీఆర్ ప్రభుత్వం లోనే ప్రారంభించాం. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిబ్బన్ లు కటింగ్ చేస్తున్నడు. ఎదుటి వారికి గౌరవం ఇచ్చి మాట్లాడాలి అన్న సోయి కూడా ముఖ్యమంత్రి కి లేదని అన్నారు.

మహంకాళి జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తే స్థానిక ఎమ్మెల్యే గా గౌరవించి స్వాగతం పలికినా. కరోనా సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టి లో ఉంచుకొని భవిష్యత్ అవసరాల దృష్ట్యా సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట లలో టిమ్స్ హాస్పిటల్ కు కేసీఆర్ శంఖుస్థాపన చేశారు. మంది పిల్లలను మా పిల్లలుగా మేము చెప్పుకోము. మా ప్రభుత్వం లో 60 శాతం పనులు జరిగాయి. పనులు పూర్తి కాకుండా, సౌకర్యాలు కల్పించకుండానే హడావుడిగా హాస్పిటల్ ను ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చింది. హాస్పిటల్ సందర్శిస్తామంటే హౌస్ అరెస్ట్ లు ఎందుకు చేశారు.. ఎందుకు అంత భయమని ప్రశ్నించారు.

22 ఏ తీసుకొచ్చింది మీరు కాదా? పొరపాటు జరిగాయని మంత్రి క్షమాపణ చెప్పడం అంతా డ్రామా . 22 ఏ ను అడ్డం పెట్టుకొని 30 నుండి 40 శాతం కమిషన్ లు వసూలు సెటిల్ మెంట్ లు చేయలేదా? ప్రయివేట్ భూములు, పేదల ఇండ్లను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని అన్నారు.

# 22 ఏ పై బి.అర్.ఎస్. అనవసర రాద్ధాంతం

## టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ మాజీ మంత్రి హరీష్ రావు రాజీవ్ గాంధీకి రాసిన లేఖపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. 22 ఏ పై బి.అర్.ఎస్. అనవసర రాద్ధాంతం చేస్తుంది. కింది స్థాయిలో జరిగిన తప్పిదం మా దృష్టికి వస్తే లోపాలను సరిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. తప్పిదం జరిగిందని సాక్ష్యతు మంత్రి ప్రకటించి సరిదిద్దారు. 22 ఏ వల్ల భూదందా, భూముల అన్యాక్రాంతానికి అవకాశం ఉండదు. మా ప్రభుత్వం లో సామాన్యులకు అన్యాయం జరిగితే గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చని అన్నారు.

పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యల పై వ్యాఖ్యానిస్తూ ఆయన తో మాట్లాడాం. ఆయన ఆవేదన ను అర్థం చేసుకున్నాం. నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ లో సీనియర్ నేతలకు 70 శాతం పదవులు ఇస్తాం. బాన్సువాడ లో పాత కొత్త నేతల కలయిక తో ముందుకు వెళ్తాం. పోచారం కాంగ్రెస్ సిద్ధాంతాలకు , సంక్షేమానికి మద్దతుగా ఉన్నారని అన్నారు.

# గుంటూరు జిల్లా వ్యాప్తంగా 'ఓపెన్ డ్రింకింగ్' పై ప్రత్యేక తనిఖీలు



గుంటూరు జిల్లా పోలీసు లు నిన్న రాత్రి 7గంటల నుండీ 10 గంటల వరకు గుంటూరు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించి 21ఎఫ్ ఐ ఆర్ లు,109 పెట్టి కేసులు పలువురిపై నమోదు చేసినారు. గుంటూరు జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల వేధింపుల నుంచి మహిళలు, సాధారణ పౌరులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 'ఓపెన్ డ్రింకింగ్' పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ??జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ముఖ్యమైన కూడళ్లు, వైన్ షాపుల సమీప ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు మరియు నిర్మానుష్య రహదారులలో తనిఖీలు చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. కౌన్సెలింగ్: బహిరంగంగా మద్యం సేవించడం నేరమని, దీనివల్ల సమాజంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని అదుపులోకి తీసుకున్న వ్యక్తులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

# కంగనా రనౌత్ లబ రాందేవ్‌బాబా!

## తన బెడ్‌రూమ్ గాసిప్స్‌తో పాఠాలు చెప్పొద్దని ఎంపీ కౌంటర్!

ముంబై, ఆగస్టు 20 బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, ప్రముఖ యోగా గురువు, పతంజలి సంస్థల సహ వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్ మధ్య ప్రస్తుతం తీవ్రమైన వాగ్వాదం చోటు చేసుకుంది. దేశంలోని యువతను ఉద్దేశించి కంగనా రనౌత్ గతంలో చేసిన జనరేషన్ గట్టర్ వ్యాఖ్యలతో ఇరువురు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తన వ్యాఖ్యలను తప్పుపడుతూ, తన వ్యక్తిత్వాన్ని, గతాన్ని ప్రశ్నించిన బాబా రామ్‌దేవ్‌పై కంగనా రనౌత్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. ఈ వివాదంలో కంగనా రనౌత్ నేరుగా బాబా రామ్‌దేవ్‌కు తన వ్యక్తిత్వం గురించి నీతులు చెప్పవద్దని హితవు పలికారు. అంతేకాకుండా పతంజలి బ్రాండ్ తప్పుడు ప్రకటనల కేసులో 2024లో బాబా రామ్‌దేవ్ , ఆచార్య బాలకృష్ణను సుప్రీంకోర్టు మందలించిన విషయాన్ని గుర్తు చేశారు. తనపై ఎటువంటి మోసపూరితమైన ఆరోపణలు లేదా కేసులు రుజువు కాలేదని, కాబట్టి తన క్యారెక్టర్ గురించి మాట్లాడే అర్హత రామ్‌దేవ్‌కు లేదని చెప్పారు. గత నెలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్? వద్ద జరిగిన నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేక విద్యార్థి నిరసనల్లో ఉన్నాయి. ఈ నిరసనలకు సంబంధించిన కొన్ని వీడియోలను చూసిన తర్వాత కంగనా రనౌత్ సోష్ మీడియా వేదికగా తీవ్రమైన అసంతృప్తిని, అభ్యంతరకరమైన వ్యాఖ్యలను పోస్టు చేశారు. నిరసనలలో పాల్గొంటున్న యువత భాష, వారి ప్రవర్తన అసహ్యం కలిగించే విధంగా ఉన్నాయని కంగనా పేర్కొన్నారు. తల్లిదండ్రులపై ఆర్థికంగా ఆధారపడుతూ స్వేచ్ఛను దుర్వినియోగ చేస్తున్నారని మాదకద్రవ్యాల వాడకం, మద్యపాన అలవాట్లను గ్లోరిఫై చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర వృత్తిరమైన మహిళల జీవితాలను అనుసరించాలని భావిస్తున్న కొంతమంది యువ హిందూ మహిళలను ఉద్దేశించి, వారు ఆ స్వచ్ఛను సంపాదించకుండానే వారిలా జీవించాలని చూస్తున్నారని విమర్శించారు. వారికి వ్యవస్థను అందించేందుకు ఏమీ లేదని, చదువులో రాణించలేరని, బాడీ కౌంట్ వంటి పాశ్చాత్య ధోరణులకు అలవాటు పడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే అటువంటి ప్రవర్తన కలిగిన యువతను జనరేషన్ గట్టర్ లేదా వెస్ట్రనైజ్డ్ గట్టర్ అని పిలిచారు. ఇది దేశవ్యాప్తంగా పెద్ద వివాదానికి, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ తర్వాత కంగనా రనౌత్ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను దేశంలోని యువత మొత్తాన్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని, కేవలం జంత్ మంతర్ నిరసనల్లో అసభ్యకరంగా ప్రవర్తించిన కొంతమంది వ్యక్తులను లేదా కొందరు మహిళలను మాత్రమే ప్రత్యేకగా ప్రస్తావించనని స్పష్టం చేశారు.

# ఎర్రచందనం ముద్దాయిపై పీడీ యాక్ట్

ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళ కు చెందిన అజయ్ కుమార్ కె ఎలియాస్ అజయన్ (57) పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు.

ఇందులో భాగంగా కేరళ కు అజయ్ కుమార్ కె ఎలియాస్ అజయన్ (57) క్లాత్ మర్చంట్ ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇతనిపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ సిఫారసు చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఇతనిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. ఇతనిపై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి.

ఇతనిపై పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

# సుష్మిత వ్యాఖ్యాలు బాధాకరం

నిజామాబాద్ కొండా సుస్మిత వ్యాఖ్యల పై.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం, తీవ్రంగా ఖండిస్తున్నాం. సుస్మిత వ్యాఖ్యల పై మంత్రి కొండా సురేఖ కు షోకాజ్ నోటీసులు ఇచ్చామని అన్నారు. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి వివరణ కోరాం. వివరణ ఇచ్చాక తదుపరి చర్యకు తీసుకుంటాం. చిన్నారెడ్డి సీనియర్ నాయకులు , పార్టీ లైన్ దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవు. అభ్యర్థులను ఎవరు ప్రకటించిన అవి చెల్లవు. పార్టీలో ఓ విధానం ఉంటుంది. ఎన్నికల కమిటీ, సిడబ్ల్యూసి నిర్ణయం ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందని అన్నారు.

## దేవులవాడ గ్రామంలో అనారోగ్యంతో మరణించిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

దేవులవాడ గ్రామానికి చెందిన అసంపల్లి చిన్నయ్య ఇటువలె అనారోగ్యం మరణించిన నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ సర్పంచ్ దుర్గం సమ్మక్క, ఆసరేల్లి తిరుపతి కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు గార్ల ఆధ్వర్యంలో 4000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు, కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆసరెల్లి లక్ష్మణ్ , మంచినీళ్ల స్వామి, ఆసంపల్లి శేఖరు, ఆసంపల్లి రాజ్ కుమారు, సెగం రవికుమార్ ,బుడే శ్యామ కుమార్ , కొటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టుపై రోడ్డు ప్రమాదం

మహబూబ్ నగర్ జూరాల ప్రాజెక్టుపై రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు యువకులు ఒకే బైక్పై అతివేగంగా వచ్చి స్పీడ్ బ్రేకర్ని ఢీకొట్టింది. బైకు అదుపుతప్పి పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు యువకులు బాలానగర్ మండలానికి చెందిన వారుగా గుర్తించారుర.

## నీటి నిల్వ కోసం ఫారం పాండ్...

పాల్వంచ, ఆగస్టు20 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారంకాలనీ , తొగ్గూడం గ్రామపంచాయతీ పరిధిలోనీ రైతు బానోత్ బద్రు పొలంలో 20ఖ 20 మీటర్ల విస్తీర్ణంలో, 3 మీటర్ల లోతుతో ఫారం పాండ్ నిర్మాణాన్ని గురువారం ఎంపీడీవో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ, ఫారం పాండ్‌లో నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు చేపల పెంపకానికి కూడా అనుకూలంగా ఉంటుందని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు , వి బి జి రామ్, సిబ్బంది, గ్రామ సర్పంచ్ తేజావత్ వినోద్ కుమార్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఫారం పాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎంపీడీవో పి. రాజారావు పాల్వంచ మండలంలోని తొగూడెం, జగన్నాథపురం, కారెగట్టు సత్యనారాయణపురం, మందారికలపాడు, లక్ష్మీదేవిపల్లి-జ, ఉలవనూరు, రేగులగూడెం, చంద్రలగూడెం మరియు మల్లారం గ్రామపంచాయతీలలో పర్యటించారు.

## వానల కోసం ఎదురుచూపులు కాదు... ప్రతి చుక్కకు జలభద్రతే లక్ష్యం

(హెచ్.ప్రతాప్)

తెలంగాణలో నైరుతి రుతుపవనాల మందగమనం కేవలం వర్షపాతం లోటు సమస్యగా కాకుండా రాష్ట్ర జలభద్రతకు ముందస్తు హెచ్చరికగా చూడాల్సిన సమయం ఇది. ఇప్పటివరకు రాష్ట్రంలో 430.1 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, సాధారణంగా ఈ కాలానికి 488.8 మి.మీ. ఉండాలి. దీంతో సుమారు 12 శాతం లోటు నమోదైంది. ఆగస్టులో వర్షాలు మందగించడంతో 15 జిల్లాలు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటున్నాయి.

జలాశయాల నిల్వలను గత ఏడాదితో పోల్చితే పరిస్థితిలోని వ్యత్యాసం మరింత స్పష్టమవుతుంది. ఆగస్టు 9న నాగార్జునసాగర్‌లో ఈ ఏడాది సుమారు 145.65 టీఎంసీల నీరు ఉండగా, గత ఏడాది ఇదే సమయంలో 310.25 టీఎంసీలు ఉంది. అంటే గత ఏడాది నిల్వలో సగానికంటే తక్కువ. శ్రీరాంసాగర్‌లో ఆగస్టు 6న 38.799 టీఎంసీల నిల్వ ఉండగా, గత ఏడాదితో పోలిస్తే నీటిమట్టం దాదాపు సమానంగా ఉంది. మరోవైపు నిజాంసాగర్‌లో ఈ ఏడాది 9.984 టీఎంసీలు ఉండగా, గత ఏడాది ఇదే రోజున 4.571 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. అంటే రాష్ట్రంలోని జలాశయాల పరిస్థితి ఒకే విధంగా లేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

అందువల్ల వర్షపాతం సగటు ఎంత అన్నదానికంటే, ఎక్కడ ఎంత నీరు ఉంది, ఎంతకాలం ఆ నీరు సరిపోతుంది, రాబోయే వర్షాలపై ఎంత ఆధారపడాలి అన్నదే కీలకం. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూనే సాగునీటి వినియోగాన్ని శాస్త్రీయంగా ప్రణాళిక చేయాలి. రైతులు కూడా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక, సూక్ష్మ సాగునీటి పద్ధతులు, నేలలో తేమను నిలుపుకునే విధానాలను అనుసరించాలి.

దీర్ఘకాలికంగా చెరువులు, కుంటలు, వాగుల పునరుద్ధరణతోపాటు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పునర్భరణకు ప్రాధాన్యం పెరగాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షాలు ఎప్పుడు, ఎంత కురుస్తాయన్న అనిశ్చితి పెరుగుతోంది. కాబట్టి 'వర్షం కోసం ఎదురుచూడటం' నుంచి 'వచ్చిన ప్రతి చుక్కను ఒడిసిపట్టుకోవడం' వైపు జల విధానం మారాలి. ప్రస్తుత వర్షపాతం లోటు ఆందోళనకు కారణమే అయినా, దానిని సమర్థవంతమైన నీటి నిర్వహణకు ఒక అవకాశంగా మలచుకోవడమే తెలంగాణ భవిష్యత్ జలభద్రతకు సరైన మార్గం.

## స్లేట్ ది స్కూల్‌లో ఉచిత డెంటల్ క్యాంప్



హైదరాబాద్ ఆగస్ట్ 20:ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో స్లేట్ ది స్కూల్, హిమాయత్ నగర్ లో నేడు 300 విద్యార్థులకు ఉచిత డెంటల్ చెకింగ్ క్యాంపు నిర్వహించారు.


ఈ శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించినారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి భోజనం అలవాటులను మార్చుకునే విధంగా అవగాహనా కల్పించాము.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది మరియు వాలంటీర్లు పాల్గొని క్యాంప్‌ను విజయవంతం చేశారు.

ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆరోగ్య అవగాహనలో భాగంగా ఇలాంటి ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంపులు, వైద్య శిబిరాలు మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్సగ్యుటీ డైరెక్టర్ జి.మాధవి టిలిపారు.

## సాయి సేవా ధర్మ ట్రస్ట్ ఆద్వర్యం లో పీపల్ పహాడ్ గ్రామంలో గ్రంథాలయం ప్రారంభం





చౌటుప్పల్ ఆగస్టు 20 ;అతి ప్రాచీన చరిత్ర కలిగిన పీపల్ పహాడ్ గ్రామంలో జన గ్రంథాలయం ప్రారంభమైంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లోని పీపల్ పహాడ్ గ్రామంలో ఈ గ్రంథాలయాన్ని గ్రామ సర్పంచ్ నాగేశ్వరి అశ్విన్ లు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన దాసరి మంగళ, నాగేశ్వరి, శోభ లు చేసారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ ఉద్యమకారులు, విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

గౌరవ అతిథిగా సీనియర్ పాత్రికేయులు నేలంటి మధు, ఆత్మీయ అతిథులుగా విపంచి ఫౌండేషన్ గౌరవ సలహాదారులు ఆందోజు నాగభూషణం, పీపల్ పహాడ్ జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు శోభ లు హాజరయ్యారు.

కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కవి రచయిత లెక్కల మల్లారెడ్డి రాసిన సాయుధ పోరాటం 1948 పుస్తకాన్ని జెడ్ పి హెచ్ స్ ప్రధానోపాధ్యాయురాలు శోభ ఆవిష్కరించారు. ంష్ట్రబ అలాగే నేలంటి మధు రచించిన రాజకీయ వృత్తి పుస్తక పునర్ ముద్రణ కాపీలను సర్పంచ్ నాగేశ్వరి అశ్విన్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ ప్రాధాన్యతను తెలియజేశారు. పుస్తక పఠనం ఎంత ముఖ్యమో సోదాహరణంగా వివరించారు. సోషల్ మీడియా ప్రభావాన్ని తెలియచెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించాలని, పిల్లలకు చిన్నప్పటి నుంచే ఈ అలవాటు నేర్పించాలని అన్నారు.

నేలంటి మధు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో ఆన్లైన్లో పుస్తకాలు చదివినా అవి తాత్కాలికంగా సహాయపడతాయే గానీ విషయం పూర్తి గా అర్థం చేసుకోవడానికి పుస్తకాలు మాత్రమే ఆధారం అని చెప్పారుఆందోజు నాగభూషణం మాట్లాడుతూ పీపల్ పహాడ్ గ్రామానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఈ ఊరికి తనకు చాలా కాలంగా అనుబంధం ఉందని చెప్పారు. ఈ గ్రామంలో జన గ్రంథాలయం ప్రారంభించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని చెప్పారు నాగేశ్వరి అశ్విన్ లు మాట్లాడుతూ తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రంథాలయంలో పుస్తకాల కోసం తాము కనబరిచిన ఆసక్తిని తెలియజేశారు. పుస్తకాలపై తమకు ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేశారు. పీపల్ పహాడ్ జన గ్రంథాలయం అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి సాయి సేవా ధర్మ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి భోగా నాగభూషణం అధ్యక్షత వహించారు. కార్యక్రమం అనంతరం సాయి సేవా ధర్మ ట్రస్ట్ అధ్యక్షులు ఊడుగు రాములు వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ తరపున దానయ్య, పాలకవర్గ సభ్యులు ఎర్ర మహేష్, గట్టు మల్లేశ్, మరియు ఊరి ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## భాదితులను పరామర్శించిన మాజి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో నారాయణపూర్ గ్రామస్తులు చేపట్టిన వినూత్న నిరసనలో ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 100 మంది గ్రామస్తులు జోలలు పట్టుకుని ర్యాలీగా వచ్చి సామూహికంగా గంగాధర క్రాస్ రోడ్ లో బిక్షాటనతో అడుక్కుంటు గురువారం నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఎండలో సుదీర్ఘంగా నిరసనలో పాల్గొనడంతో నీరసించి ముగ్గురు మహిళలు ఒక్కసారిగా కిందపడినట్లు సమాచారం. వెంటనే వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని అస్వస్థతకు గురైన మహిళలను పరామర్శించారు. వారిని పలకరించి ధైర్యం చెప్పారు.

## తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలు

### ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిష్ బంకర్

హైదరాబాద్, ఆగస్ట్ 20 : తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలున్నాయని ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిష్ బంకర్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్(రిటైల్ ప్రొటెక్షన్) వ్యాపారంలో 60.7 శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ 206 మార్చి 31 నాటికి రాష్ట్రంలో 6,56,032 మందికి కవరేజీ అందించగా, నిర్వహణలోని ఆస్తులు రూ.11,708 కోట్లు, సమ్ అష్యూర్డ్ రూ.1,52,016 కోట్లుగా నమోదైనట్లు చెప్పారు. గత ఏడేళ్లలో తెలంగాణలో రూ.4,060 కోట్ల ప్రయోజనాలను, రూ.1,192 కోట్ల డెత్ క్లెయిమ్‌లను చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కంపెనీకి 11 సొంత బ్రాంచీలు, 3,934 పార్ట్‌నర్ బ్రాంచీలు, 3,372 స్పెసిఫైడ్ పర్సన్స్, 6,172 అడ్వైజర్లు ఉన్నారు. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమసికంలో 99.3 శాతం క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో సాధించగా, విచారణ అవసరం లేని వ్యక్తిగత క్లెయిమ్‌లను సగటున ఒక రోజులో పరిష్కరించినట్లు తెలిపారు. కస్టమర్ సేవల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, డిజిటలైజేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రూ పార్టనర్ స్టాక్, ఐ.పి.ఆర్.యు ఎడ్జ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఏజెంట్లు, భాగస్వాములకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కంపెనీ పేరును ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ గా మార్చేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలున్నాయని తెలిపారు. బ్రాంచీల విస్తరణ, అడ్వైజర్ల నియామకం, కస్టమర్ అవగాహన కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.




## సామాన్యుడిలా బైక్‌పై సీపీ సజ్జనార్.. కేబీఆర్ చుట్టూ చక్కర్లు!

### వన్‌వే ట్రాఫిక్‌పై క్షేత్రస్థాయిలో పరిశీలన.. వాహనదారుల ఇబ్బందులపై ఆరా

రంగారెడ్డి ఆగస్టు 20 ; సాధారణంగా పోలీసు వాహనాల కాన్వాయ్‌లో కనిపించే పోలీస్ కమిషనర్.. ఈసారి మాత్రం సామాన్యుడిలా బైక్‌పై రోడ్డెక్కారు. కేబీఆర్ పార్క్ చుట్టూ కొత్తగా అమల్లోకి వచ్చిన వన్‌వే ట్రాఫిక్ విధానం ఎలా పనిచేస్తుందో స్వయంగా తెలుసుకునేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ బైక్‌పై చక్కర్లు కొట్టారు. రోడ్ నంబర్ 45 నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు, ముగ్ధ జంక్షన్, బసవతారకం, అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్ జంక్షన్ మీదుగా తిరిగి రోడ్ నంబర్ 45 వరకు రెండుసార్లు ప్రయాణిస్తూ ట్రాఫిక్ రాకపోకలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం వేళల్లోనూ మరోసారి పరిస్థితిని సమీక్షించారు.



అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో సీపీ మాట్లాడారు. వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ట్రాఫిక్ రాకపోకల సరళిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన్‌వే అమలైన తొలిరోజు లేన్ల మార్పిడిపై వాహనదారుల్లో కొంత అయోమయం నెలకొన్నప్పటికీ ప్రస్తుతం రాకపోకలు సాఫీగా సాగుతున్నట్లు సిబ్బంది సీపీకి వివరించారు. వాహనదారులకు స్పష్టత కల్పించేందుకు జంక్షన్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు తెలిపార హెచ్–సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ రూ.1,100 కోట్లతో ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులను వేగవంతం చేసేందుకు పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్‌లు నిర్వహించి, గుర్తించిన సమస్యలకు అనుగుణంగా ట్రాఫిక్ మార్పులు చేశారు. ట్రాఫిక్ పరిస్థితిని కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నాలుగు షిఫ్టుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బందిని మోహరించడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్లు, హై–రైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. వన్‌వే విధానం సుమారు రెండేళ్లపాటు కొనసాగే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందుగానే ట్రాఫిక్ అడ్వైజరీలను పరిశీలించి ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరవాసులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి, సూచనలు పాటించాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

### భూత్పూర్ సర్కిల్ కార్యాలయం వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి,

మహబూబ్ నగర్‌పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, సూచించారు. గురువారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగాఎస్పీ పరిశీలించి, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు తదితర అంశాలను సమీక్షించారు.ఇన్‌స్పెక్టర్ స్థాయిలో దర్యాప్తు చేస్తున్న కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, నాణ్యమైన ఆధారాలతో కేసులను కోర్టులో సమర్థవంతంగా నిరూపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు.సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల రాఊబాలతో క్రమం తప్పకుండా నేర సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న నేరాలపై విశ్లేషణ చేయాలని సూచించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, పాత నేరస్తులు, రౌడీషీటర్లు మరియు అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం మరింత పెరిగేలా బాధ్యతాయుతమైన, ప్రజా అనుకూల పోలీసింగ్‌ను కొనసాగించాలని తెలిపారు.

మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భూత్పూర్ సర్కిల్ పరిధిలో భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్, దేవరకద్ర, సీసీ కుంట పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, వీటి పరిధిలో ఔఊ–44 భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్ మీదుగా, ఔఊ–167 దేవరకద్ర, సీసీ కుంట మీదుగా వెళ్తున్నందున జాతీయ రహదారులపై నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.

# ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ధర్నాను విజయవంతం చేయండి

### టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు

### పిఆర్సీ ప్రకటన వచ్చేవరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 20:** ఈనెల 27వ తేదీన ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల టీజీ జెఏసి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ముందు చేపడుతున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు కోరారు. ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట,బురద రాఘవాపురం, ఏన్కూర్ కాంప్లెక్స్ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్, మూడ్ పుల్లయ్య, పిఆర్టియు నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు,టిజిటిటిఎఫ్ నాయకులు హతీరామ్,తఫాస్ సంఘ నాయకులు బి.సేవియా టిజీటిఎఫ్ నాయకులు నరసయ్య అధ్యక్షతన జరిగిన వివిధ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయుల ఉద్దేశించి టీజీ జెఏసి నాయకులు మాట్లాడారు.సమస్యల పరిష్కారం కోసం టీజీ జెఏసి నాయకత్వంలో పోరాటాలకు పిలుపును ఇచ్చినందున పోరాట కార్యాచరణను విజయవంతం చేయాలని తెలియజేశారు. జూన్ రెండున ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండు నెలలు గడిచిన ప్రధాన డిమాండ్లు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్ సక్రమంగా అమలు కాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈహెచ్ఎస్ ను సమర్ధవంతంగా అమలు చేయాలని, రెండవ పిఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఆరు పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబరు ఒకటో తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన వారికి ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. విద్యాశాఖలో రేషలైజేషన్ కు సంబంధించిన జీవో 25ను సవరించాలని, టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని, టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పండిట్స్ పిఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని, సిఆర్ టి ల సర్వీసును క్రమబద్ధీకరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 27న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1 వ తేదీన విద్రోహ దినం నల్లబ్యాడ్జీలతో నిరసన, సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్ లో మహాధర్న చేపడుతున్నట్లు తెలియజేశారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తిమ్మారావుపేట కాంప్లెక్స్ హెచ్ఎం రహీం బీ, ఏన్కూర్ కాంప్లెక్స్ హెచ్ఎం వాసవి దేవి, బురద రాఘవాపురం హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు శ్రీదేవి,సింగ్య,రమేష్, శంకర్రావు,పుల్లయ్య, రామారావు,రాఘవరావు, బి.నాగేశ్వరరావు, బి. నరసింహారావు, రవిలాల్, వెంకట నరసయ్య, రవికిరణ్, నరసింహారావు, సునీత, కుమారస్వామి, హీరాలాల్, భగవాన్ దాస్, శశికళ సునీత సోనాబాయి, వేణు, రమేష్, నరసింహారావు, ఝాన్సీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ, యూఎల్సీ పెండింగ్ దరఖాస్తులకు త్వరిత పరిష్కారం

### కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 20:** 22ఏ నిషేధిత భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) పరిధిలోని దరఖాస్తుల క్లియరెన్స్కు సంబంధించి రీటైనబుల్ భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్లోని యూఎల్సీ విభాగాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, ఆన్లైన్ డేటా నమోదు, జీవోల అప్లోడింగ్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోల ఆధారంగా సంబంధిత వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేసి, యూఎల్సీకి సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ప్రజావాణి హాల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, డీఐలు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల ప్రక్రియను సత్వరమే పూర్తి చేసేందుకు అవసరమైతే రాత్రి వేళల్లోనూ పనులను కొనసాగించి, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

యూఎల్సీ ఆన్లైన్ డేటాను త్వరగా క్లియర్ చేసేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పలు కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు




కరీంనగర్ ఆగస్టు 20 జిల్లాలో నేరాలకు పాల్పడిన నిందితులకు న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడేలా కరీంనగర్ పోలీస్ కోర్టు విభాగం విశేష కృషి చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 17 కీలక కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తూ కోర్టులు తీర్పులు వెలువరించాయి. ఇందులో మూడు హత్య కేసుల్లో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు ఖరారయ్యాయి. గంజాయి, పోక్సో, హత్యాయత్నం, రోడ్డు ప్రమాదాలు, దొంగతనం, చీటింగ్ తదితర కేసుల్లోనూ కఠిన శిక్షలు విధించారు. జిల్లా క్రైమ్ రివ్యూ సమావేశంలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పీపీలు, ఏపీపీలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. పకడ్బందీ దర్యాప్తు, బలమైన సాక్ష్యాధారాల సమర్పణ, కోర్టు సిబ్బంది?పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో ఈ శిక్షలు సాధ్యమయ్యాయని సీపీ తెలిపారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు

# రైల్వే సమస్యలపై గళమెత్తిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### దక్షిణ మధ్య రైల్వే జీఎంతో కీలక సమీక్ష

### ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పలు అంశాలపై చర్చ

### భద్రాచలం రోడ్ స్టేషన్ పేరును కొత్తగూడెం లేదా భద్రాద్రి కొత్తగూడెంగా మార్చాలని వినతి

### శ్రీరాముల వారు కొలువుదీరిన భద్రాచలం వరకు రైల్వే లైన్ ను పూర్తి చేయండి

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 20 ప్రజాబలం:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనిపార్లమెంట్ సభ్యులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సికింద్రాబాద్లోని రైలు నిలయంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పెండింగ్, ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

సమస్యల పరిష్కారానికి పట్టు.

సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వే రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

భూ మార్పిడి – రోడ్ల అభివృద్ధి

భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణ కోసం ఖమ్మం స్టేషన్ వద్ద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ భూమిని మార్పిడి చేసుకునే ప్రక్రియపై దృష్టి సారించాలని కోరారు.కొత్త రైలు మార్గాలు

ఖమ్మం అర్బన్, పాలేరు నియోజకవర్గాల్లోని సారవంతమైన భూముల గుండా కాకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వే లైన్ ప్రాజెక్టును చేపట్టాలని పునరుద్ఘాటించారు.



స్టేషన్ల ఆధునీకరణ అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం రైల్వే స్టేషన్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోవిడ్ కాలంలో నిలిచిపోయిన రైళ్లను పునరుద్ధరించాలని, తడికలపుడి, మధిర వంటి ప్రాంతాల్లో మరిన్ని ఎక్స్ప్రెస్ రైళ్లకు స్టాపింగ్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

భద్రాచలం రోడ్డు స్టేషన్ పేరును భద్రాద్రి కొత్తగూడెం లేదా కొత్తగూడెం స్టేషన్ గా మార్చండి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖమ్మం నుంచి కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో.. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో భద్రాచలం రోడ్డు పేరిట కొనసాగుతున్న రైల్వే స్టేషన్ పేరును.. భద్రాద్రి కొత్తగూడెం స్టేషన్ లేదా కొత్తగూడెం రైల్వే స్టేషన్ గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని అక్కడి వరకు రైల్వే లైన్ లేని నేపథ్యంలో..ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి తిరుపతికి 'భద్రాద్రి ఎక్స్ప్రెస్'ను కొత్తగా ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. శ్రీరామచంద్ర మూర్తి కొలువైన భద్రాచలం వరకు రైలు మార్గాన్ని వేసి,ఆ తర్వాత దానిని ఛత్తీస్ ఘడ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కూడలిగా రూపొందించాలని డిమాండ్ చేశారు.

కారేపల్లి – గాంధీపురం ఆర్వోబీలు, అగ్రహారం అండర్పాస్లపై

కారేపల్లి, గాంధీపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆర్వోబీలు, అగ్రహారం వద్ద అసంపూర్తిగా ఉన్న అండర్పాస్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

ఖమ్మం నగరంలోని కస్బాబజార్ – గాంధీచౌక్ ప్రాంతంలో.. వరద ముంపు సమస్యపై కూడా ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎంపీ, డ్రైనేజీ వ్యవస్థను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రైల్వే జీఎంను ఎంపీ కోరారు.

# దళితవాడ స్మశాన సమస్యను పరిష్కరించండి

### వారం రోజుల్లోపు పరిష్కరించకపోతే రోడ్లను దిగ్బందిస్తాం

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు.

తుగ్గలి: తుగ్గలి మండల కేంద్రంలో ఉన్న దళితవాడ స్మశాన సమస్యను పరిష్కరించి, మండల వ్యాప్తంగా గుంతలు పడిన రోడ్లను వారంలోపు మరమ్మతులు చేయకపోతే రోడ్లను దిగ్బందిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం డి ఆనంద్ బాబు హెచ్చరించారు.గురువారం తుగ్గలి మండల కేంద్రంలోని రామాలయం కమ్యూనిటీ హాల్లో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం సిపిఎం మండల నాయకులు రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు.అనంతరం సిపిఎం మండల కమిటీ బృందం రాతన మరియు తుగ్గలి మండల కేంద్రంలో గుంతలు పడ్డ రోడ్లను, తుగ్గలి దళితవాడ స్మశాన స్థలాన్ని పరిశీలించి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యం.డి ఆనంద్ బాబు, మండల కార్యదర్శి శ్రీ రాములు, మండల నాయకులు రంగస్వామి మాట్లాడుతూ గ్రామాల మధ్యనే రోడ్లపై గుంతలు ఏర్పడి గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏలిన వారికి మాత్రం ఏమాత్రం పట్టడం లేదని వారు విమర్శించారు.పత్తికొండ నుండి గుత్తికి వెళ్లే ప్రధానమైన రహదారిలో రాతన గ్రామంలో 20 మీటర్ల పరిధిలో గుంతపడి అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.తుగ్గలి ప్రారంభంలోనూ, రైల్వే బ్రిడ్జి కింద గుంతల మయంగా ఉన్న గుర్తించడం లేదన్నారు,గత సంవత్సర కాలంగా రాతన తుగ్గలి ఎర్రగుడి జొన్నగిరి గ్రామాలలో రోడ్ల మరమ్మతులు నిర్వహించాలని ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చినా వినే వారే కరువయ్యారన్నారు.వారం రోజుల్లోపు ఈ రోడ్లు మరమ్మత్తులు చేయకపోతే రోడ్లను దిగ్బందించి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. అలాగే తుగ్గలి మండల కేంద్రంలోని దళితవాడ స్మశాన వాటికకు వెళ్లాలంటే దళితపేట నుండి ఒకసారి వాగు దాటి బండి రస్తాలో వెళ్లి తిరిగి స్మశానం దగ్గరికి వెళ్లిన తర్వాత ఆ వాగును తిరిగి దాటాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.వాగులు దాటేందుకు బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నిసార్లు మొత్తుకున్నా కనికరించకపోవడంతో దళితులే చందాలు వేసుకొని స్మశానం దగ్గర చిన్నపాటి బ్రిడ్జిని ఏర్పాటు చేసుకున్నారన్నారు.అయినా స్మశానంలోకి వాగు నీళ్లు వచ్చి గుట్టలు సైతం కొట్టుకుని పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దళితపేట వద్ద బ్రిడ్జి నిర్మించడంతోపాటు స్మశానంలో మట్టితోలి గుట్టలు,అందులోని శవాలు కొట్టుకొని పోకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగాధర్, ప్రసాద్,శికామణి,కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి

### ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ఆగష్టు 20 సి. బెళగల్ కోడుమూరు నియోజకవర్గంలో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని త్రాగునీటికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు..ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు.శాసనసభసమావేశాల్లో భాగంగా ఆయన నియోజకవర్గంలోని నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలకు తాగు నీరు లభించక ఇబ్బందులు పడుతున్నారని,అలాగే వేసిన పంటలను కూడా రైతులు తొలగించాల్సి వస్తోందని, అసెంబ్లీలో సభ స్పీకర్ దృష్టికి తెచ్చారు.కోడుమూరు నియోజకవర్గానికి సాగు, తాగు నీరందించే కేసీ కెనాల్,గాజులదిన్నె ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటి వాటా ఆధారంగా కర్నూలు, కోడుమూరు,కల్లూరు మండలాలలోని గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి కారణంగా హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు మునుపెన్నడూ లేని విధంగా ఎక్కువ టీఎంసీల నీటిని విడుదల చేశారన్నారు.దానివల్ల కొంతవరకు నీటి సమస్య తీవ్రత తగ్గినా,గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఓటరులిస్టు సవరణ అనుమానాల నివృత్తికి ప్రజల స్పందన









**గండి పేట మండలం ప్రజా బలం ప్రతి నిధి 20 ఆగస్టు 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మున్సిపల్ డివిజన్,నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో క్రొత్తగా వెలువడిన ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రం నెంబర్ 29 మొదలు 81 వరకూ ఓటరు లిస్టు సవరణలో భాగంగా తమ తమ పేరులు నమోదు సక్రమంగా జరిగినవా లేదా అనే ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) డిజిటలైజేషన్ ఓటరు సహాయ శిబిరంనకు ఆకర్షితులై శివపూరి కాలనీ ప్రజలు తండోప తండాలుగా శిబిరం వద్దకు గురువారం రోజున విచ్చేసి ఓటు నమోదు అయినను కాకున్నను విషయం తెలుసుకొనడానికి అనూహ్య స్పందన లభించిందని నాయకులు బి ఆర్ ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సుమనళిని, జై రామ్, స్థానికులు మధు, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, సావిత్రి, శివగంగా తదితరులు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానంలను నెరవేర్చని కారణంగా, అదేవిధంగా ప్రజలను ఏమార్చడానికి గాను కుటుంబ సభ్యుల ఓట్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో నమోదు కావడం పట్ల ప్రజలు తీవ్ర అసంపూర్తిని వ్యక్త పరుస్తు, ఇట్టి విషయమై పునః ఆలోచించి మొత్తం కుటుంబ సభ్యుల ఓట్లు ఒక్క చోటనే ఉంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్త పరిచారు.

## భూ భారతి'యే మా ప్రభుత్వానికి రెఫరెండమ్!

**రాబోయే ఎన్నికల్లో మా పనితీరుకు ఇదే ప్రామాణికం : బేతుపల్లి సభలో మంత్రి పొంగులేటి ప్రకటన**

**అక్రమాలకు అడ్డుకట్ట.. ప్రతి అంగుళం భూమి సరిగ్గా కొలిచి టైటిల్స్ ఇస్తాం**

**22ఏ పేరిట దోచుకున్న ఆస్తులను వదిలిపెట్టేది లేదు.. 'సిట్' ద్వారా ముక్కు పిండి వసూలు చేస్తాం**




**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజాబలం:**ఈ ప్రజా ప్రభుత్వంలో మేము ప్రవేశపెట్టిన 'భూ భారతి' చట్టం అమలే రాబోయే ఎన్నికల్లో మా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండమ్. చట్టం తెచ్చేనాడే ఈ మాట చెప్పాం.. ఈ రోజుకీ అదే మాట మీద నిలబడుతున్నాం. ప్రజల తీర్పు దగ్గరకు పోయినప్పుడు మీకు ఫలితాలు ఏంటో గతంలో చూపించాం.. భవిష్యత్తులోనూ అవే



ఫలితాలు పునరావృతం అవుతాయి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో భూ రీ సర్వే రైతులతో గురువారం నిర్వహించిన ముఖాముఖి – అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

భూమిపై రైతన్నకు ఉన్నది ఎమోషనల్ బాండింగ్..

భూమి అనేది కేవలం మన్ను కాదు.. అది రైతన్నకు గుండెకాయ లాంటి ఎమోషనల్ బాండ్. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో తీవ్ర అవకతవకలు జరిగాయి. సాగులో ఉన్న పేద రైతుకు పాస్ పుస్తకాలు రాకపోగా, సెంట్ భూమి లేని భోగస్ వ్యక్తులకు పదుల ఎకరాల రికార్డులు సృష్టించి బ్యాంకులు, రైతుబంధు సొమ్ము దోచుకున్నారు" అని మంత్రి ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టులో సర్వే చేయగా వేలాది ఎకరాల భోగస్ భూములు బయటపడ్డాయని, అందుకే ఇప్పుడు బేతుపల్లితో పాటు రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ రోవర్ టెక్నాలజీతో సర్వే చేపడుతున్నామని వివరించారు.

అబాదీ ఆస్తులకు పక్కా సర్వే -- టైటిల్స్ పంపిణీ..

ప్రతి జిల్లాలో తొలివిడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి, రాబోయే ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములతో పాటు నివాస ప్రాంతాల (అబాదీ) భూములను కోఆర్డినేట్స్, మ్యాప్‌లతో సహా సర్వే చేస్తామన్నారు. ప్రతి రైతుకూ డిజిటల్ కోఆర్డినేషన్ మ్యాప్‌తో కూడిన పక్కా హక్కుల టైటిల్ డీడ్ ఇస్తామని పేర్కొన్నారు.

22ఏ అక్రమాలపై 'సిట్' బాణం..

ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గతంలో చట్టం తెచ్చి 3 ఏళ్లు రూల్స్ చేయలేని వాళ్లు.. ఈ రోజు మూడో నెలలోనే నిబంధనలు తెచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని చూసి కారుకూతలు కూస్తున్నారు. 22ఏ ప్రొహిబిటెడ్ లిస్ట్ పేరుతో అమాయక ప్రజలను కవచంగా పెట్టుకుని, తెరచాటున వేలాది ఎకరాల అక్రమ ఆస్తులను రెగ్యులరైజ్ చేసుకోవాలని పగటి కలలు కంటున్నారు. ఈ ప్రభుత్వంలో మీ పప్పులు ఉడకవు. ప్రజల సొమ్ము తింటే వంటపట్టదు. ఇందుకోసం ఇప్పటికే 'సిట్' వేశాం.. ముక్కు పిండి వసూలు చేస్తాం" అని హెచ్చరించారు.

రాష్ట్రమంతటా స్వయంగా నేనే వస్తా!..

కరీంనగర్, నిజామాబాద్ సహా ప్రతి జిల్లాకూ రెవెన్యూ మంత్రిగా స్వయంగా వెళ్లి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, అక్రాస్ ది టేబుల్ సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, స్థానిక శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ ఆలోచనలు యువతకు మార్గదర్శకం

కరీంనగర్  మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకమని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్‌చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ.. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో 21 ఏళ్లు నిండిన యువతకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కల్పించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

## రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆర్.బి.ఎస్.కె డాక్టర్ నరహరి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20** ఏటూరు నాగారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని  తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ స్పోర్ట్స్ బాయ్స్ ఏటూరు నాగారం నందు 177 మంది విద్యార్థులకు శారీరక మానసిక వైద్య పరీక్షలు మరియు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది కొంతమంది విద్యార్థులను మెరుగైన చికిత్సకై ఏరియా హాస్పిటల్ ఏటూరు నాగారం మరియు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ములుగు రెఫర్ చేయడం జరిగింది విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహార పదార్థాల గురించి మరియు పొగాకు వంటి మాదకద్రవ్యాలు వాడితే కలుగు అనర్థాల గురించి వివరించడం జరిగింది అలాగే విద్యార్థులకు శారీరక మానసిక ఎదుగుదలలో కలుగు అనుమానాలు మరియు పరీక్షల సమయంలో ఒత్తిడి ఎదురుకొనుటకు  సలహాల కై 14416 కు ఫోన్ చేస్తే కౌన్సిలింగ్ ఇస్తారు అని తెలపడం జరిగింది  ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ స్కూల్ ఏఎన్ఎం రజిని మరియు అధ్యాపకులు పాల్గొన్నారు

## అక్రమ వేటగాళ్లను కఠినంగా శిక్షించాలి

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బానోతు సుందర్ లాల్**

**ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ కు ఘన నివాళి**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాదావత్ సైదులు నాయక్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 20 ప్రజాబలం:** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బానోతు దేవ్లా నాయక్  కుమారుడు



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ కర్తవ్య నిర్వహణలో భాగంగా ఫారెస్ట్ లో  అక్రమంగా వేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందారు. బుధవారం వెంకిటియ తండా లో నవీన్ దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్లాల్ సోదరుడు బానోత్ సుందర్ లాల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాదావత్ సైదుల్ నాయక్ పాల్గొని నవీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ వేటగాళ్లను, ఎంతటి వారైనా ఉపేక్షించకుండా భవిష్యత్తులో ఇలాంటి అధికారులను పోగొట్టు కోకుండా ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి మేము వెన్నుదన్నుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో  బానోత్ భారత్, జరుపుల దేవలాల్, భూక్యా మంగ్య,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా మహిళా మోర్చా కమిటీ నియామకం

**- జిల్లా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రి**

**- 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీ నియామకం**

**- బిజెపి అనుబంధ మహిళా కమిటీని ప్రకటించిన జిల్లా అధ్యక్షులు" బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

**చంద్రుగొండ /కొత్తగూడెం ఆగస్టు 20 ప్రతినిధి బొగ్గుల** :-భారతీయ జనతా పార్టీ అనుబంధ జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీని పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో జరిగిన మహిళా మోర్చా కమిటీకి పూర్తిస్థాయి 26 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించడం జరిగింది. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రిని నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా అధ్యక్షురాలు సముద్రాలు గాయత్రి ఆధ్వర్యంలో 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. కమిటీలో ఉపాధ్యక్షులుగా కేతిని సావిత్రి,





బానోత్ గంగ, అట్రం మమత, గరిక లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా జల్ల స్వప్న, ముప్వ అపర్ణలను నియమించారు. అదేవిధంగా కార్యదర్శులుగా ధారావత్ పార్వతి, అడప వెంకట మణి, బట్టు సంధ్య, ఉయిక తులసిలను నియమించారు. కోశాధికారిగా భీమల్ సునీత, ఆఫీస్ సెక్రటరీలుగా భుఖ్య ఆశ, కొల్లె అనిత, సోషల్ మీడియా కోఆర్డినేటర్గా పల్లపు శిరీష, మంకీ బాత్ కన్వీనర్గా బండారి రాజేశ్వరి, ఐటీ కన్వీనర్గా పోలే మనస్విని, స్పోక్స్ పర్సన్గా భోగ లక్ష్మిలను ఎంపిక చేశారు. అలాగే తాండ్ర కుసుమ భవాని, ఏసు మని, ధారావత్ భారతి, ధారావత్ విష్ణు ప్రియ, పుట్ట వెంకటరమణ, పర్సగాని నాగమణి, పర్సగాని శ్రావణి, రావుల పద్మ, పుట్టి సుజాతలను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ మహిళా మోర్చా నూతన కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేకించి 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వివక్షతకు వ్యతిరేకంగా బిజెపి మహిళ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి పార్టీలో మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించడం హర్షణీయమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

# రాజీవ్ జయంతి.. కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి

## దేశ ప్రగతికి రాజీవ్ చూపిన బాట..ఆశయాలతో ముందుకు సాగుదాం..

**కూకట్పల్లి,(ప్రజాబలం )ఆగస్టు 20 :** దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. కె.పి.హెచ్.బి., మూసాపేట్, బాలానగర్, ప్రకాష్నగర్ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలు నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్, కేపీహెబీ డివిజన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిలారు శ్రీనివాస్బాబు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు పెద్దపీట వేస్తూ దేశ భవిష్యత్తుకు బాటలు వేసిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సాంకేతిక రంగంలో భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాకు బిపి ఉండదు...ప్రతిపక్షాలకు తెప్పిస్తా.....

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**సత్తుపల్లి ప్రతినిధి ఆగస్టు 20 ప్రజాబలం:** నాకు ఎప్పుడు బిపి ఉండదు మేము చేస్తున్న అభివృద్ధి చూసి ప్రతి పక్షాలకు బిపి వస్తుంది అని రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ లోని యన్ టిఆర్ నగర్ లో 1.43 కోట్ల రూపాయలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న డాక్టర్ లతో బిపి చెక్ చేయించుకున్నారు. మీకు బిపి నార్మల్ గా ఉండటానికి సీక్రెట్ ఏంటి సర్ అని డాక్టర్స్ అడిగిన ప్రశ్నకు నాకు ఎప్పుడు బిపి ఉండదని మేము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రతిపక్షానికి బిపి పెరుగుతుందని అయన సరదాగా సమాధానం ఇచ్చారు.విద్య వైద్యం వంటి మౌలిక సదుపాయలు కల్పించడమే లక్ష్యం గా పని చేస్తున్నామని ప్రతి పేదవానికి వైద్యం అందుబాటులో ఉంచడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర, డిఎం హెచ్ఓ రామారావు, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిప్యూటీ డిఎం హెచ్ఓ ప్రదీప్, మెడికల్ ఆఫీసర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి సమాచార, సాంకేతిక విజ్ఞానాన్ని పరిచయం చేసిన నవభారత రూపశిల్పి, భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ..సత్యం శ్రీరంగం

## దేశ ప్రగతి, ఆధునిక భారత నిర్మాణం కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం

**కూకట్పల్లి (ప్రజాబలం ) ఆగస్టు 20:**భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కేపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి ఆహ్వానం మేరకు రాజీవ్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కేపిహెచ్బి బస్స్టాండ్లో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి సత్యం శ్రీరంగం హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు పునాదులు వేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు బలమైన బాటలు వేసిన మహానేత రాజీవ్ గాంధీ 40 సంవత్సరాల వయస్సులో భారతదేశానికి అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానమంత్రి అయ్యాడని,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వారు చేసిన సేవలు యువతకు ఎంతో మార్గదర్శనంగా నిలుస్తూ రాజకీయాలో రణించేలా చేస్తుందని అన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్,టెలికాం ఐ ఐటీ విప్లవం మరియు స్థిరమైన శాంతి ఒప్పందాలను బలోపేతం చేయడం వంటి బహుళ జోక్యాల ద్వారా 21వ శతాబ్దంలో భారతదేశాన్ని మార్చారని, దేశానికి అతిపిన్న వయసులో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన నాయకుడు రాజీవ్ గాంధీ ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి మనందరికీ ఎల్లప్పుడూ మార్గదర్శకం అని అన్నారు.



ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవ రావు, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, గాలి బాలాజీ, దేశాల్, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, డివిజన్ ల అధ్యక్షులు రాజేష్ శంకర్ గౌడ్, మస్తాన్ రెడ్డి, కలికోట శంకర్, కిలారు శ్రీనివాసబాబు, కొండల్ రెడ్డి, మేకల మైకల్, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్,సాయి బాబు చౌదరి, కృష్ణ రాజ్ పుత్, బి బ్లాక్ రామారావు, సరోజ, సుజాత, అరవింద, ప్రణీత, పిడికిటి గోపాల్ చౌదరి, నితీష్ గౌడ్, కల్పన, రంగ ప్రసాద్, పవన్, జిబిన్ మహిళా కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారి 72వ జన్మదిన వేడుకలు ఘనంగా, చిరస్మరణీయంగా



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 20 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :మాజీప్రధానమంత్రి, భారతరత్న శ్రీ పి.వి నరసింహారావు తనయుడు శ్రీ పి.వి. ప్రభాకర్రావు,72వ జన్మదిన వేడుకలు ఘనంగానిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు వేద పండితుల ఆశీర్వచనాలతో, పవిత్రమైన వేద మంత్రోచ్చారణలు మరియు సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఆయనకు వేదాశీర్వాదం అందిస్తూ, ఆయురారోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి, దీర్ఘాయుష్షు కలగాలనిప్రార్థించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లోని ఆయన నివాసంలో జరిగిన ఈ శుభ కార్యక్రమం ఆధ్యాత్మికతతో,ప్రశాంతమైనవాతావరణంతోప్రారంభమై,అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయ మిత్రులు, చిన్ననాటి స్నేహితులు, సహాధ్యాయులు,శ్రేయోభిలాషులు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టీ వై జె ఎఫ్ ) సభ్యుల సమక్షంలో అత్యంత వైభవంగా కొనసాగింది. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ఆయన చిన్ననాటి స్నేహితులు, సహాధ్యాయులు తమ జ్ఞాపకాలనుపంచుకున్నారు. పాఠశాల రోజుల్లోని అనుభవాలను, చిన్ననాటి మధురస్మృతులను గుర్తుచేసుకుంటూ, శ్రీ పి.వి. ప్రభాకర్ రావు సరళత, వినయం, స్నేహపూర్వక స్వభావం, మంచితనం, జీవితాంతం పాటిస్తున్న విలువలను వారు ఆత్మీయంగా వివరించారు. ఆయన సోదరీమణులు,బావమరుదులు, ఇతర బంధువులు,కూడా ఆయన వ్యక్తిత్వం, కుటుంబ జీవితం గురించి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ముఖ్యంగా తన భార్య, పిల్లల పట్ల ఆయన చూపించే ప్రేమ, ఆప్యాయత, శ్రద్ధ, అండదండలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి మాటల్లో పదేపదే వినిపించిన ఒకవిశిష్టమైన లక్షణం శ్రీ పి.వి. ప్రభాకర్ రావు మర్యాద, సరళత, ప్రశాంత స్వభావం, నిగర్వితనం, జీవితాన్ని ప్రశాంతంగా చూసే తీరు. భారతదేశంలో అత్యంత గౌరవనీయులైనప్రధానమంత్రుల్లో ఒకరైన భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు,తనయుడిగా,ఒక విశిష్ట కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ నిరాడంబరంగా, సామాన్యుడిలా,అందరితో ఆత్మీయంగా మెలుగుతూ తనదైన గౌరవప్రదమైన వ్యక్తిత్వాన్నికొనసాగించారు. ఈ జన్మదిన వేడుకలను ఘనంగా, చిరస్మరణీయంగానిర్వహించడంలో ఆయన కజిన్ బ్రదర్ శ్రీ పి.వి. శరత్ చేసిన కృషిని శ్రీ పి.వి. ప్రభాకర్ రావు, ప్రత్యేకంగా అభినందించారు. ఏర్పాట్లు ఎంతోచక్కగాజరిగాయని సంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యక్రమాన్నివిజయవంతం, చేయడంలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది, సమన్వయకర్తల కృషిని కూడా ప్రశంసించారు. ఆయన మేనల్లుళ్లు, కజిన్ బ్రదర్స్ కూడా ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్ ) అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్,దిసౌత్ఇండియా టైమ్స్ బ్యూరో చీఫ్ డా. జితేందర్ రావు తనుగుల కూడా (టీ వై జె ఎఫ్ ) యూనియన్ సభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని శ్రీ పి.వి. ప్రభాకర్ రావు కుహృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.డా. జితేందర్ రావుతనుగుల హాజరు, (పి వై జె ఎఫ్ )సభ్యుల భాగస్వామ్యం ఈ వేడుకలకు మరింత ఆత్మీయత, ప్రాధాన్యతనుతీసుకువచ్చింది. ఈ వేడుక కేవలం ఒక జన్మదిన వేడుకగా మాత్రమే కాకుండా, 72 సంవత్సరాల విలువైన జీవిత ప్రయాణానికి కుటుంబ విలువలు, స్నేహం, వినయశీ,గౌరవం, ఆత్మీయ సంబంధాలకు అద్దం పట్టిన ఒక అందమైన నివాళిగా నిలిచింది. చిన్ననాటి జ్ఞాపకాలు, కుటుంబ సభ్యుల ఆప్యాయత, మిత్రులమధురస్మృతులు, నిర్వాహకులు మరియు సిబ్బందిపై ప్రశంసలు, బంధువులు,శ్రేయోభిలాషులు, (టీ వై జె ఎఫ్) సభ్యుల సమక్షం ఈ వేడుకనునిజంగా ప్రత్యేకమైనదిగా, చిరస్మరణీయమైనదిగా మార్చాయి. ఈశుభ సందర్భంలో కుటుంబ సభ్యులు,బంధువులు, స్నేహితులు, (టీ వై జె ఎఫ్ ) సభ్యులు, శ్రేయోభిలాషులు శ్రీ పి.వి. ప్రభాకర్ రావుకు హృదయపూరక జన్మదిన శుభాకాంక్షలుతెలియజేస్తూ, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి కలగాలని, తన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, మిత్రుల మధ్య మరెన్నో ఆనందకరమైన సంవత్సరాలు గడపాలని మనస్ఫూర్తిగాఆకాంక్షించారు...

## టీచర్కు భయపడి కుప్పకూలి ఎల్కేజీ విద్యార్థి మృతి

విశాఖపట్నం లిటిల్ గార్డెన్ స్కూల్లో హోంవర్క్ చేయలేదని టీచర్ కొట్టడంతో ఎల్కేజీ విద్యార్థి ప్రణయ్ తేజ్ (6) భయపడి గుక్కపెట్టి ఏడుస్తూ, కుప్పకూలి టీచర్ మీద పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీసీటీవీ ఫుటేజ్ చూసి ఆగ్రహంతో స్కూల్ ఎదుట ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

## రావులపల్లి ,గుడు గుంట నుండి మర్పల్లి వెళ్లే దారి వెంటనే మరమ్మత్తు చేయాలి గ్రామ సర్పంచ్ భారతమ్మ



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 20(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంరావులపల్లి – కుడుగుంట నుండి మర్పల్లి వెళ్ళే దారి పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందిసమయానికి వెళ్లలేకపోవడంఆటోలు గుంతల వల్ల నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు అనుకున్న సమయానికి పాఠశాలలకు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు.

కుడుగుంట గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు ఎన్ని సార్లు పిర్యాదులు చేసిన



పట్టించుకోని అధికారులు.వర్షాల కారణంగా రోడ్డు కంకరతో నిండి ఉండడంతో ఆటోలు వేళ్ళని కారణంగా విద్యార్థులు నడుచుకుంటూ చౌరస్తకు వెళ్తున్నారు ఇలా రోజురోజుకు గ్రామ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు విద్యార్థులు ముఖ్యంగా ప్రతిరోజు చాలా సమస్యలతో కాలినడకన వెళ్తూ అనేక ఇబ్బందులు విద్యార్థులు పడుతున్నారని ఇట్టి విషయం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్ గారికి మా గ్రామ సమస్యను త్వరలో వారి దృష్టికి తీసుకెళ్లాలని గ్రామ సర్పంచ్ భారతమ్మ గ్రామ పెద్దలు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ ప్రజల ఇబ్బందులు గుర్తించి విద్యార్థుల సమస్యలను గుర్తించి వెంటనే మర్పల్లి చౌరస్తా రోడ్డు నుండి గుడి గుంట వరకు నుండి రావులపల్లి గ్రామ చౌరస్తా వరకు వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామ సర్పంచ్ భారతమ్మ గ్రామ పెద్దలు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తపరిచినట్లు తెలిపారు

## పెళ్లిరోజు వేడుకలకు కొత్త అర్థం.. విద్యార్థులకు అండగా కొప్పుల దంపతులు!



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20:**బేతుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు కొప్పుల అపూర్వనాథ్––ప్రమీల దంపతులు తమ పెళ్లిరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు.

ఆడంబరాలకు దూరంగా.. సేవా కార్యక్రమాలతో పెళ్లిరోజును జరుపుకున్నారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేసి వడ్డించారు.



అనంతరం విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

తమ సంతోషాన్ని విద్యార్థులతో పంచుకుంటూ.. వారి చదువుకు చిన్నపాటి సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు దంపతులు తెలిపారు. "మా పెళ్లిరోజు మా కుటుంబానికే కాదు.. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావాలి" అనే ఆలోచనతో సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పెళ్లిరోజు వేడుకలకు సేవా స్పర్శను జోడించిన కొప్పుల దంపతుల ఆదర్శం.. పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## నవ భారత నిర్మాత... నవ యువతకు స్ఫూర్తి ప్రదాత



**ఆందోల్ నియోజకవర్గశీ ప్రతినిధి ఆగస్టు 20 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా** :మాజీప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

### జాహ్నవి చదువుకు 20,000 ఆర్థిక సాయం... మానవత్వం చాటుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు..

పాల్వంచ, ఆగస్టు20 ( భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లయన్స్ క్లబ్ అఫ్ కిన్నెర పాల్వంచ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాల్వంచ పట్టణంలోని రాహుల్ గాంధీ నగర్ కు చెందిన జాహ్నవి విషయం తెలుసుకుని గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చేపూరి బ్రహ్మచారి జాహ్నవి పై చదువుల నిమిత్తం ( పోస్ట్ గ్రాడ్యుయేషన్ ) రూ 20,000/– ల చెక్కును ను జాహ్నవి తండ్రి ఈశ్వర్ కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా పై చదువుల కోసం ఇబ్బంది పడుతుంటే తమ సంస్థకు తెలియజేస్తే ఆర్థికంగా ఆదుకుంటామని అన్నారు.

## సత్తుపల్లిలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 20:** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను సత్తుపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సత్తుపల్లి మెయిన్‌రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు.



ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. యువతకు ప్రాధాన్యత, సాంకేతిక రంగంలో ఆధునికత, దేశాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్,అధ్యక్షులు సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా విజయ్ నియామకం.

### విజయ్ ని సన్మానించిన మండల కమిటీ, నాయకులు

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 20 ప్రజాబలం:**సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయు దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆదేశాల మేరకు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా కొత్తపల్లి విజయ్ ని మండల కమిటీ నియామకం చేసింది.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జన్మదినం సందర్భంగా విజయ్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అభివృద్ధిని సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ఆశీస్సులతో తల్లాడ మండలంలో అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేందుకు అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండల కమిటీ, నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అభిమానులకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ కి



సేవలందిస్తానని, అందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా తల్లాడ మండలంలోని జిల్లా కమిటీ, మండల కమిటీ ముఖ్య నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, నున్న శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి ఎం ప్రసాద్, కంచపోగు వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు, కల్లూరు టౌన్ ఇంచార్జ్ కోసూరు వెంకటేశ్వరరావు (కె.వి),జిల్లా కార్యదర్శి మర్సకట్ల బాబురావు, హెచ్చి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రి నరసింహారావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ , కోదూరు రాము,హరీష్ రెడ్డి, తాళ్ల వెంకటి , మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు

### ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం... తహసిల్దార్ రవి ఆగస్టు 22,23, 29,30 తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు.

తుగ్గలి: భారత ఎన్నికల సంఘం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నందు అభ్యంతరాల సవరణ కొరకు ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహిస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.గురువారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిములు మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని ఆయన తెలియజేశారు.ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించేందుకు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విస్తృతంగా నిర్వహించేందుకు ఆగస్టు నెల 22,23,29 మరియు 30 తేదీలలో కర్నూలు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం నందు సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తారని,ఫారం–6 అర్హత కలిగిన కొత్త ఓటర్ల నమోదు చేస్తారని, ఫారం–7 ద్వారా మరణించిన వారు, ఇతర ప్రదేశాలకు తరలి వెళ్లిన వారి పేర్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని,ఫారం–8 ద్వారా పేరు, వయస్సు,చిరునామా వంటి వివరాలలో దిద్దుబాట్లు నిర్వహిస్తారని,ఫారం–8ఏ ద్వారా ఒకే నియోజకవర్గంలోపు చిరునామా మార్పులను అధికారులు నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు.కావున కర్నూలు జిల్లా ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలను సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చేసుకోవాలని తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com